1703

ఆర్య శతకం

(చిత్రపది)



" నా నృషి : కురుతే కావ్యమ్" - భట్టతౌతుడు

తె.సా.[illegible]
[illegible]
[illegible] 3357

కపిలవాయి లింగమూర్తి

7031 - F 3357-

ఆర్య శతకం

(చిత్రపది)

Prof. B. RAMA RAJU, (Rtd.)
H. No. 1-8-117/2, Chikkadpally,
HYDERABAD-500 020.



"నా నృషిః కురుతే కావ్యమ్" - భట్టతౌతుడు

ఎ. పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం
కడప వారికి ——————————
—————————— బహూకృతి

కపిలవాయి లింగమూర్తి

ఆర్య శతకం

ప్రథమ ముద్రణ : కాళయుక్తి - శ్రావణం - 1978
ద్వితీయ ముద్రణ : వృష చైత్రం - మార్చి 2001

ప్రతులు : 1000

వెల : రూ. 30/-

గ్రాఫిక్స్ :
యాపిల్ గ్రాఫిక్స్
6-1-816, మార్కెట్ దగ్గర,
ఖైరతాబాదు, హైదరాబాద్ - 4.
ఫోన్ : 3231229

ప్రింటర్స్ :
దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రెస్
విద్యానగర్, హైదరాబాద్ - 44.
ఫోన్ : 7634299

ప్రతులకు :
కె. కిశోర్ బాబు
వాణీ సదనం
17-110, విద్యానగర్ కాలనీ
నాగర్‌కర్నూల్ - 509 209.
ఫోన్ : 08540-26437

ఈ శతకాన్ని గురించి

1. తెలుగు పలుకుల పొలపము మీశతకము వెలార్చు చున్నది. ఈకాలమున కులమునకుగల మేలిమి ఆవిధముగా చెప్పుటకు చాలా ధైర్యము కావలయును. ఆంధ్ర భాష మాధురీ ధురీణ యనుటకు మీరిచ్చిన కారణము నాకు బాగుగా నచ్చినది. (చూ.ప. 18) ఇట్లే అనేకములు.

తీర్థం శ్రీధరమూర్తి, మద్రాసు - 30.6.1980

2. ఆర్య శతకము చిత్రపది యనుట సార్థకము. ప్రతిపద్య చమత్కృతితో యియ్యది రమణీయము. ప్రాచీన చిత్రకవిత సాధారణముగా శబ్దాశ్రయము. మీ చిత్రపది అర్థాశ్రయము. కావున మీరచన అర్థచిత్ర కవితయని వక్కాణింప నగునని నా ఆశయము.

రావూరి దొరసామి శర్మ - 28.7.1980

3. మీ గ్రంథములన్నియు పాండితీ పటిమకు ఒరిపిడి పట్టే సానరాళ్లు. అయితే పిట్ట కొంచెము కూత ఘనమన్నట్లు మీ గ్రంథములన్నియు నొకయెత్తు. ఆర్యశతక మొకయెత్తు. ఈ గ్రంథములో మీరుచూపిన శబ్ద చమత్కార ప్రదర్శన మపూర్వము. బహుధా ప్రశంసనీయము.

బైరెడ్డి సుబ్రహ్మణ్యం, తిరుపతి - 19.9.1985

4. మీ ఆర్య శతకము పఠించితిని. ఆ చిత్రపది కందములలో విచిత్రముగా ఆనంద కందముగా ఆలోచనామృతముగా ప్రబోధాత్మకముగా తమ వ్యాకరణాభినివేశమునకు అభిజ్ఞానముగా నున్నది.

అగస్త్యరాజు సర్వేశ్వరరావు, M.A., B.Ed. **అద్దంకి - 1.12.1986**

5. తమ చిత్రపదులు భవభూతినుండి తాబెట్టినగీ సుమియిది వరకు - ఒకరికొకరు పోటీపడి చదివి ఆనందించిరి. ఇందులో ఏది గొప్ప అను వివాద ముద్భవించి వారిలోవారే ఇవన్నియు ఒకేతల్లి బిడ్డలే అయినందున హెచ్చుతక్కువలు లేవని నిర్ధారించు కొనిరి. ఇచటి Y.R.S. & V.N.R. కాలేజీల ఉపన్యాసకులే తమ శతకపద్యములు వ్రాసికొని కంఠస్థమునకై తీసికొనిరన్న అవి ఎంతటివో తమకే తెలియగలవు.

వాసవి అకాడమి ప్రొప్రయిటర్, చీరాల - 19.12.1986

6. కపిలవాయి లింగమూర్తిగారు ఒక వినూత్నమైన వస్తువును తీసికొని ఈశతకాన్ని నడిపారు. నాగరికత (32), కపటి (37), ఆడుది (43), బాపు (53), స్త్రీ (18), వారకాంత (56), వెలయాలు (58), ధీ (70) పదాలకు వారుచేసిన వ్యాఖ్యానం మమ్ముల్నాశ్చర్యచకితుల్ని చేసింది. వీటిలో వారి కావ్యవ్యాకరణ మర్మజ్ఞత విశద మౌతున్నది.

చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి - 13.10.1987

7. మీ ఆర్యశతకము శ్రీమత్ప్రతాపగిరి ఖండము చదివాను. చమత్కారాలలో సరళ భాషలో ప్రాబంధిక శైలిలో చక్కగా మనసు నాకట్టుకొనే లాగున్నాయి.

మంగమ్మ, కర్నూలు - 11.5.1988

8. రాజును సాధించుట కష్టమని కాని - శ్లేష - విశ్వామిత్రంచే సాధ్యమని నా స్నేహితులతో అనుకొనుచు తమరి ఆర్యశతకం తెలుపగా (34) ఆ పద్య మగుపడి ఆశ్చర్యపడి ఆనాడే వీరబ్రహ్మముగారి కాలజ్ఞానముగా తాము ప్రయోగించిన పదవిన్యాసమున కబ్బుర మందితిమన్న అతిశయోక్తిగాదు.

నా.రా. అర్చక, కె.కె. పల్లె, వయా గాండ్లపెంట - 18.12.1989

ఇది ఆర్యనుద్దేశించిన కవిత ఆర్యు నుద్దేశించిన కవితగూడ అయింది. ధ్వని శబ్దబ్రహ్మంబున దనరుననే విషయాని కీ శతకమంతా ఉదాహార్యమే.

వికట కవికి కుడియెడమలు నొకటిగనే తోచునను ప్రకటపు కవిసమయమ్ములు ప్రకృత మహాకవులకు హృదయ సంవేద్యములే.

ప్రత్యయంలో ఉండే భేదం పరిహరించలేము. శస్త్ర శాస్త్రములకు అకారభేదమే తప్ప అన్యభేదములేదు.

మానిసికి తిరుగుబాటయితె నేడుసిద్ధించేది "సినిమా"యేనని పామర భ్రాంతి. ఆ పూనకపు కన్నులతో సత్యశోధన దుస్సాధ్యంగదా !

శబ్ద చమత్కార భరితమైన ఈశతకం శబ్దబ్రహ్మ చమత్కారం రుచిచూపుతూ ధ్వని సంప్రదాయం ప్రవర్షించింది. నేటికాలంలో ఇట్టి శతకం మీరొక్కరే వ్రాయగలరేమో !

వి.వి.ఎల్. నరసింహారావు - 19.10.90

పద్యాలు

1. కలిమూర్తుల సహజమైన - కవితా గానం వింటె
అచ్చుకంద పద్యములను - అల్లిన తీరేవేరే
జానుతెనుగు పోకడలను - సంధించే తీరుజాడ
ముద్దుముద్దు పదముల పడ - బోయు రీతిమున్నారే
సరేసరే ఒకేఒకే - మరువని మీ అభిమానం
అలరించెను నన్నంటి - అంటదులే అన్యతభయం.

మిత్రుడు-కొసరాజు - 17.10.1960
నార్త్ గిరియప్ప రోడ్డు, మద్రాసు-17.

2. ఆ. భావ శుద్ధి గలిగి భాషార్ణవంబును - చిలికి చిత్రపదిని మలచినావు
కవనమన్న వడల నవనీత మద్దుచు - కపిలవాయి లింగకవివిహంగ

మోరా వామనాచార్యులు, డిండి - 3.4.1979

3. కం. మీ పద్యమ్ములు చిత్రో - ద్దీపిత భావనలు నా హృదికి మోదంబున్
ప్రాపింప జేసె సఖా - మాపున్ రేపున్ సుఖింపుమా కవిదీప్తిన్.

చేబ్రోలు చిన్మయబ్రహ్మకళి, రాజమండ్రి - 3.1.1981

4. కం. కలలును వాయును గలుగుట - పలుకులలో నెనసియున్న పసనెఱుగుట - నా
ర్యులుమెచ్చగ పలునార్యలు - పలికిరిగా లింగమూర్తి పండితవర్యుల్.

కుంటిముద్ది శేషశర్మ - 12.7.1983

5. కం. ఆర్యా! నమ్మెదొ నమ్మవొ - ఆర్యా శతకంబుగూర్చె నామోదంబున్
పర్యాలోచిత శబ్దా - హార్య చమత్కారమందు నద్భుతము సుమా.

కం. పాండిత్యము భావుకతయు - శౌండీర్యము సంగమించి చక్కనిదౌ పూ
దండగ నార్యాశతకము - మండితమై యొప్పుచుండె మహిలో సుకవీ !

కె. రామచంద్రరావు, మంచిలి - 24.5.1989

-: కొండాటము :-

6. చేవతెలుంగు తేనెనుడి చేడియ నట్టువమాడె వ్రాయికిన్
ప్రోవడి యాయె కప్పురము పోణిమి మాసరగాగ పేర్మి పూ
దీవియ నిండుతావి మెయి దీనుగనవ్వెను మీదుకైతతో
మేవడి కందమై తెలుగుమేపరి నిద్దపువిన్కి మన్కిమేల్
వావిరి నందుమో కపిలవాయి జగమ్ముమలు చాంగురే యనన్.

వాకొన తీయమాయె విలువల్ దులకించెను పువ్వపుంబసన్
దూకొను జేజతో కరద దోరణగట్టిన రేవయట్లుగా
వ్రాకిన తెల్గుపల్కు నెఱపద్దును దీర్చిన మేటి లింగమూ
ర్తీ కుదురైన మేటికిటు రెప్పము మీకగుగాత నిచ్చలున్.

సూదగాని శ్రీనివాసరావు, పర్సనల్ ఆఫీసర్,
హిందుస్తాన్ షిప్‌యార్డ్, విశాఖపట్టణం.
(వీరు లేఖపై తేదీ వేయలేదు)

అభివాదాలు - ఆశీస్సులు

1. మొదటిసారి దీని ముద్రణ మునకును
సాయ పడిన మిత్రు సహృదయ మణి
బేర్కొ నెదను సరసు వెల్దండ వెంకట
రావు కీర్తి శేషు - ధీవి శాలు

2. చదివి నపుడు దీని సంతస మున దను
స్పందనంబు దెలిపి సంబ్ర మిడిన
విబుధ వరుల కెల్ల వినయాన కేల్మోడ్తు
కవికి వలయు నంతె గాదె జగతి.

3. కోరి నంతనె మదినెట్టి కొరత వడక
అచ్చు వేయించి రౌదార్యు లైన యట్టి
యిందిరా శ్రీనివాసులు నిపుడు దీని
ఇందిరా శ్రీనివాసులు నెల్లవేళ
గాచెదరు గాక వీరిని కలుము లిచ్చి.

4. అచ్చు పనుల నెల్ల నరయుచు తనవిగా
నా రచన ప్రచార కార ణంబు
నైన శిష్య తముడు, నగు యుమాముద్దీను,
కెపుడు శుభము లల్ల యిచ్చుగాత.

ఆర్య శతకం

1. శ్రీదలపెట్టిన ఘనుడని
మోదంబున బుధులు బొగడ పుడమియందు ని-
ర్వేదులకు దారిజూపిన
శ్రీదయితుని దలచిమదిని జెప్పెద నార్యా !

1. శ్రీదలపెట్టిన ఘనుడు = (i) లోకానికి శుభం తలపెట్టినవాడు.
(ii) శ్రీ అనే శబ్దం తలలో చేర్చిన ఘనుడు అనగా శ్రీఘనుడు.

2. నిర్వేదులు = (i) నిరాశతో కలిగిన దుఃఖంకలవారు.
(ii) వేదమార్గంలో లేనివారు.

3. శ్రీదయితుడు = (i) లక్ష్మీవల్లభుడు (ii) మంగళప్రదమిష్టమైనవాడు.

హిందూమతంలో అవతారబుద్ధుడు, గౌతమ బుద్ధుడు అని ఇద్దరు బుద్ధులున్నారు. ఈ పద్యం ఆ యిద్దరి పరంగా చెప్పబడింది.

శుభాభ్యాం శుభేశోభనే మంగళ ముహూర్తే
శ్రీ మహా విశ్వకర్మాజ్ఞయా ప్రవర్త మానస్య ఆద్యబ్రహ్మణః
ద్వితీయ పరార్ధే శ్వేతవరాహ కల్పే సప్తమేవైవస్వత మన్వంతరే
బౌద్ధావతారే అష్టా వింశతితమే కలియుగే ప్రథమపాదే

అని యిపుడు మనవారు సంకల్పంలో స్మరించే బుద్ధుడు మొదటివాడు. శుద్ధోదనుని కొడుకు రెండవ వాడు. అతనికి అమరకోశంలో

శ్లో॥ **మునీంద్ర శ్రీఘనశ్శాక్యముని శాక్యమునిస్తుయః**

అని శ్రీఘనుడనే పేరు చెప్పబడింది. విష్ణుపరంగా ఇది లోకానికి శుభం తలపెట్టినవాడని బుద్ధుని పరంగా ఘనశబ్దానికి శ్రీకారం తలస్థానంలో ఉంచబడిన వాడని అర్థం. అదేవిధంగా నిర్వేదులకు దారి జూపిన వాడనగా సంసార సాగరంలో మునిగి నిరాశోపహతులైన వారికని, వేదాన్ని విశ్వసించని వారికిని విష్ణువు పరంగాను, బుద్ధుని పరంగాను అర్థం. విష్ణువు శ్రీదయితుడు అనగా లక్ష్మీదేవికి యిష్టమైన వాడు. బుద్ధుడేమో

ఈలోకానికి మంగళప్రదం, ఇష్టమైనవాడు కనుక ఆయిద్దరిని నేను మనస్సులో స్మరించి ఈ ఆర్యశతకాన్ని చెబుతున్నాను.

2. కం. భవభూతి కాళిదాసుకు
భువిలోనొక మాత్రతగ్గ పూదేనియ బిం
దువు జిందిగాచువాణి న
నవరతముంగొల్తు వాక్కునందగ నార్యా !

ఒక మాత్ర తగ్గన్ = (i) ఒకింత తక్కువకాగా, (ii) అక్షరాల ప్రకారం ఒక మాత్ర తక్కువకాగా.

కాళిదాసు అనేపేరుకు ఆరుమాత్రలు, భవభూతికి అయిదుమాత్రలు. అందుకే భవభూతి కాళిదాసుకంటె ఒకమాత్ర తక్కువ.

ఒక పర్యాయం కాళిదాసు భవభూతి తమతమ కావ్యాలు తీసికుని సరస్వతి దగ్గరకు వెళ్ళి తమలో ఎవరు గొప్పవారో చెప్పమని అడిగినారు. అపుడామె వారిద్దరి కావ్యాలు తీసికుని త్రాసులో చెరొక వైపుంచగా భవభూతి కావ్యంగల పళ్ళెం కొంచెం పైకి లేచింది. అదిచూచి ఆమె వెంటనే తనచెవిపై నుండే కలువపూవు తీసి కొంచెం విదిలించగా దానినుండి ఒక తేనెబిందువాకావ్యంపై బడి అపుడు ఆరెండు సమానమైనవి. ఈ వృత్తాంతం భల్లాలసేనుడు తన భోజ ప్రబంధం అనే కావ్యంలో

శ్లో॥ అహోమే సౌభాగ్యం మమచ భవభూతేశ్చ భణితి
తులాయామరోప్య ప్రతిఫలతి తస్యాం లఘిమని
గిరాం దేవి సద్యః శ్రుతి కలిత కల్హార కలికా
మ ధూళీ మాధుర్యం క్షిపతి పరిపూర్త్యై భగవతి

అని కాళిదాసునోటనే చెప్పించినాడు. కాళిదాసు కాళీభక్తుడు. భవభూతి సరస్వతీ ఉపాసకుడు. అందుచేత అది యెరిగిన సరస్వతి తనభక్తుడైన భవభూతిని కాళిదాసుకంటె తేలికకాకుండా ఆవిధంగా కాపాడుకున్నది. కనుక అటువంటి సరస్వతిని నేను నావాక్కు కొఱకు ప్రార్థిస్తున్నాను.

నిజానికి కాళిదాసు భవభూతి సమకాలీనులుకారు గాని అభిజ్ఞాన శాకుంతలం, ఉత్తరరామ చరిత్ర రెండు తులనాత్మకంగా చూస్తే నాటక కల్పనలో ఉత్తరరామ చరిత్ర శాకుంతలానికి కొంత తగ్గినా దానిలో భాషాగౌరవంచేత రస స్ఫూర్తిచేత శాకుంతలానికి సరితూగుతుందని ఈ కల్పన యొక్క సారాంశం.

3. కం. **శోకము లోకము రెంటిని**
యేకముగాజేసి కావ్యమేర్పరచిన వా
ల్మీకి మహర్షికి వాణి వ
శీకరునకు మ్రొక్కి భక్తి జెప్పెదనార్యా !

లోకము శోకము రెంటిని యేకముగా జేసి = లోకం శోకం రెండుకూడ ఒక్కటిగా చేసి, శ్లోకం అన్నపుడు అందులో శోకం లోకం అని రెండు పదాలు సంశ్లిష్టమై ఉన్నవి కాబట్టి వాల్మీకి మహర్షి లోకాన్ని శోకాన్ని ఏకం చేసిన వాడైనాడు.

తమసానది తీరంలో నిలిచి ఆయన మొదట దర్శించింది లోకం, అనగా ప్రశాంతమైన ప్రకృతి. ఆ ప్రకృతిలో ఒకచెట్టుపై కామపరవశమై ఉన్న ఒక కొంగలజంట. ఆ తర్వాత అందులో మగపక్షిని బోయవాడు బాణంతో కొట్టగానే ఆయన పొందింది శోకం. ఆ శోకంతో ఆయన నోటినుండి అప్రయత్నంగా వెడలిన శాపవాక్కులోనే మళ్లి రామాయణార్థం ధ్వనించింది. కాబట్టి లోకాన్ని దర్శించి శోకాన్ని పొందిన ఆ మహర్షి శోకంలో మళ్లి లోకం - రామాయణ కథ - ఒదిగిపోయి కనిపించింది. ఇది ఇందులోని విశేషం. అందుచేత ఈ విషయాన్ని ఆనందవర్ధనుడు -

శ్లో॥ **కావ్యస్యాత్మనిపవార్థః తదాచాదికవేః పురా**
క్రౌంచద్వంద్వవియోగోత్థః శోకశ్లోకత్వమాగతః

పూర్వం క్రౌంచ పక్షులయొక్క వియోగాన్ని చూచిన మహర్షినోట శోకం శ్లోకమై వచ్చింది అని చెప్పినాడు.

శ్లో॥ **మానిషాదప్రతిష్ఠాంత మగమత్ శాశ్వతీసమాః**
యత్ క్రౌంచ మిథునాదేక మవధీః కామమోహితమ్.

అని ఆనాడు వాల్మీకినోట పలికిన శ్లోకమే లౌకికవాఙ్మయాని కంతటికి మొదటిది.

తా॥ ఓ బోయవాడా ! ఏ క్రౌంచ పక్షులో కామమోహితమై ఉండగా వానిలో ఒకదానిని నీవు కొట్టితివో ఆ కారణం చేత నీకీర్తి లోకంలో నిలువకుండా పోవుగాక ! ఇది దీనిలోని మొదటి అర్థం.

ఈ శ్లోకం తర్వాత బ్రహ్మ అతనికి ప్రత్యక్షమై "ఓ మహర్షి ! సరస్వతి యిక నీ నాలుకపై నిలిచింది. నీవు రామాయణాన్ని రచించు. ఆ కథకు యిదే తొలి శ్లోకమవుతుందని దీనికి -

మానిషాద = ఓ లక్ష్మీపతీ ! రావణునిది క్రుంచవంశమంటారు కనుక క్రౌంచవంశంలోని దంపతులలో కామమోహితుడైన ఒకనిని చంపినందువలన నీకీర్తి లోకంలో శాశ్వతంగా నిలుచుగాక ! అని రామాయణార్థాన్ని చెప్పివెళ్లినాడు. కాబట్టి ఈవిధంగా వాల్మీకిలోకాన్ని, శోకాన్ని రెండిటిని తనవాక్కుచేత ఏకంచేసిన వాడైనాడు. శ్లోకాన్ని గురించి ఒకచక్కని చాటువు గూడవుంది. అదిగూడ వినండి.

శ్లో॥ శ్లోకం సుశ్లోకతాంయాతి, శ్రోతరి జ్ఞాతరిస్థితే
శ్రోతరి అజ్ఞాతరి ప్రాప్తేలకారస్తత్ర లుప్యతే -

శ్లోకం అనగా పొగడ్త అని అర్థం. వినేవాడు తెలిసినవాడైనపుడు కవి చదివిన శ్లోకం అదింకా సుశ్లోకం అవుతుంది. అట్లాకానివాడు లభించినపుడు మాత్రం శ్లోకంలో లకారం లోపిస్తుంది అంటాడు. అంటే వినిపించిన వానికి వట్టిశోకం మాత్రం మిగులుతుందన్నమాట.

4. కం. నయమున కామ్రేడితమై
జయకావ్యము తెనుగుజేసి జనభాషకు వా
ఙ్మయ చింతామణి నిచ్చిన
చెయిదకాని దలచి మదిని జెప్పెదనార్యా !

అమ్రేడితము = ద్విరుక్తము యొక్క పరరూపము. అనగా ఒకే పదము రెండుమారులుచ్చరించుట. నన్ని శబ్దం కన్నడం. ఆ భాషలో దీనికి "సుందరం" అని అర్థం. నన్నయ్య అనే పదం కన్నడవాచకమని కొందరి మతం. తెలుగువారు మాత్రం దీన్ని నయ+నయ=నన్నయ అని విచిత్రంగా సాధించుకున్నారు. నయం

అనగా ధర్మం. ఇది సంస్కృతపదం. దీనికి ఆమ్రేడితముండదు. కాని ఉంటే అదినన్నయ అనియే అవుతుంది.

నన్నయగారు ధర్మాన్ని చక్కగా ఎఱిగినవాడు. అందుచేతనే మహాభారత ప్రాశస్త్యాన్ని ఉగ్గడిస్తు "ధర్మ తత్వజ్ఞులు ధర్మశాస్త్రంబని-" అని ప్రారంభించి సార్థకనాముడైనాడు.

ఆంధ్ర శబ్ద చింతామణి ఇతని కర్తృకమే అని ప్రాచీనులమతం. కాదని నేటి వారి వాదం. అంతమాత్రంలో వచ్చిన లోటేమిలేదు. మహాభారతంలో ఆయన రచించిన రెండున్నర పర్వాలే తర్వాతి కవిలోకానికంతా చింతామణియై నిల్చినవి.

5. కం. సూత్రపద ప్రాత క్రొత్తలు
ధాత్రిని వృద్ధాదిపంక్తి దనరిన యజ్వన్
పాత్రున్ తిక్క మనీషిత్రి
నేత్రున్ కవి పద్మభవు గణించెద నార్యా !

తిక్కన తండ్రి కొమ్మనమంత్రి. ఆయన మనుమసిద్ధి ఆస్థానంలో ఉండేవాడు. అతని తండ్రిపేరు తిరుకాళత్తి విభుడు. ఆనాటి మంత్రులకు తమసంతానానికి తమ ప్రభువులపేర్లు, వారి తండ్రులపేర్లు పెట్టుకునే ఆచారం కనుక కొమ్మన తన కుమారునికి "తిరుకాళత్తి" పేరుకు సంక్షిప్తమైన తిక్కన అనే పేరు తనకుమారునికి పెట్టుకున్నాడని చారిత్రకుల మతం.

పండితులు కొందరిది తిగ + కన్ను = అనే ఈశ్వరవాచకం నుండి సాధించినారు. తిగకన్ను ప్రాతాది సూత్రంలో గకారలోపం క్రొత్త శబ్దంబునకనే సూత్రంతో కకారానికి ద్విత్వం కలిగి తిక్కన్ను కాగా అది వృద్ధాదిగణంలో చేరినదై తర్వాత ఉత్వం లోపించి అకారాంతంగా నిలిచి తిక్కన అయిందని తమాషాగా ఒకపుడు సాధించినారు. కాని యిది నిజంకాకున్నా ఇందులో చమత్కారావహమైన ఒక ప్రక్రియ చూపబడింది.

తిక్కనకు "కవిబ్రహ్మ" అనే బిరుదున్నా ఆయన శివుని వంటి వాడని చెప్పటం ఈ పండితుల అభిప్రాయం.

6. కం. కనిపించని వాగ్విభవము
వినిపించుచు వీనులలర వివిధ మనస్స
త్వనికాయంబున కిడుముద
ముసు నక్షరముగ కవిత్వమున్ భువి నార్యా !

అక్షరముగ = 1. శాశ్వతముగ, 2. అక్షరాల రూపంగా.

కవి అనగా కనిపించనివి వినిపించేవాడని అర్థం. లోకాన్ని అందరు చూస్తూనే ఉన్నారు కాని కవి దృష్టి వేరు. అందరు చూచేలోకంలోనే అతడొక క్రొత్తధర్మాన్ని దర్శించి దాన్ని చెవులపండువుగా వినిపిస్తుంటాడు. అందుచేతనే అతడు కవి.

తన కవిత్వంలో అతడు అన్నిరకాల అభిరుచుల వారిని అక్షర రూపంగా అనగా శాశ్వతంగా, అంతేగాక తనయొక్క అక్షరాల పొందికరూపంగా సంతృప్తిపరుస్తుంటాడు. అట్లా ఇతరుల హృదయాన్ని సంతృప్తిపరిచేదే కవిత్వం అనబడుతుంది.

ఈ పద్యంలో పాదాది అక్షరాలలో కవిత్వం అనేపేరు నిబంధించబడింది. ఇది ఇందులోని చమత్కారం. ఇటువంటి దానిని అక్షర సంఘటనం అంటారు. అంటే కోరిన అక్షరాన్ని కోరినట్లుగా నిల్పటమని అర్థం.

7. కం. ధ్వనిశబ్ద బ్రహ్మంబున
దనరుగనుక పలుకునందె దాని భావముం
బొనరు పరీక్షించినచో
వినిపించెద నేనునీకు వినుమా యార్యా !

కావ్యస్యాత్మని ధ్వనిః = ధ్వనియే కావ్యానికి ఆత్మ

అని లాక్షణికులనగా ఈ ధ్వని శబ్దబ్రహ్మంలోనే ఉందని వైయాకరణులంటారు.

పరీక్షించినట్లయితే "ఏ శబ్దం యొక్క ధ్వని ఆ శబ్దంలోనే, ఏ పలుకు పరమార్థం ఆ పలుకులోనే ఉంది అవి మీకు వినిపించి చూపుతున్నాను వినండి" అని ఈ పద్య తాత్పర్యం.

కావ్యలక్ష్మికి శబ్దార్థాలు శరీరం. గుణాలు గుణాలు, వృత్తులు వృత్తులు అనగా ఆమె పనులు, అలంకారాలు నగలు, రసం ఆమె ప్రాణం, ధ్వని ఆమె ఆత్మ అని లక్షణ శాస్త్రాలు చెబుతవి. కనుక ప్రాణం శరీరాన్నాశ్రయించి ఉన్నట్లు కావ్యంలోని రసంగాని, ధ్వనిగాని అందులో కవి ఉపయోగించే శబ్దాల నాశ్రయించియే ఉంటవి. అయితే అది తెలియటానికి మాత్రం శబ్దశాస్త్ర పరిశ్రమ అవసరం.

8. కం. **వికటకవికి కుడియెడమలు**
నొకటిగనే దోచుసుమ్మి యెప్పుడతడు పో
ప్రకటపుకవి సమయమ్ములు
వికవికనగు శివుడురాని వినుమాయార్యా !

ప్రాచీనులు కవులను సుకవులు, కుకవులు అని రెండుగా విభజించి తమ కావ్యాలన్నిటిలో సుకవిస్తుతితోపాటు కుకవికి గూడ ఒక నమస్కారం చేసినారు.

ఈ పద్యంలో నేను వికటకవులను అనగా విపరీతవాదం లేదా వితండవాదం చేసేవారిని పేర్కొన్నాను. అటువంటివారు కవిసమయాలను అనగా ప్రాచీనులు చెప్పిన లక్షణాలను అంగీకరించరు. వారికి సుశబ్దం, అపశబ్దం రెండు ఒకేతీరుగా అనిపిస్తుంటవి. అందుచేత కొందరు తమ ప్రయోగమే సాధువని సాధుప్రయోగాలను చులకన చేస్తుంటారు.

ఈ పద్యంలో నేనుగ్రహించిన "వికటకవి" అనేది అనులోమ విలోమ పదం. ఎటునుండి చదివినా ఒకే విధంగా ఉంటుంది. ఇది దీనిలోని శబ్ద చమత్కారం. కొందరు సుశబ్దాలను మంచి కవి సమయాలను గూడ భ్రష్టుపట్టించి హేళన చేస్తుంటారు. నక్కీరుడు శివుని పద్యంలోనే తప్పు పట్టి హేళన చేసినాడు కదా !

9. కం. **తనయేకత్వము యేకవ**
చనముననే దెల్పుచుండ జనుడెరుగడు దే
వుని నొక్కడనుచు భువిచ
క్కన దోచిన రీతి బల్కు కనుమాయార్యా !

దేవుడు ఒక్కడే అనేది అన్నిమతాలు అంగీకరించిన సత్యం. అందుకే దేవశబ్దానికి బహువచనం లేదు. అది నిత్యైక వచనం. ఈ విషయం బాలవ్యాకరణం గూడ

"స్వర్గవాచి దేవసుర శబ్దంబులేకత్వ బహుత్వంబులం బ్రయోగింపబడు" అని చెప్పింది. అయినా ప్రజలీవిషయం తెలిసికోక మాదేవుడువేరు, మీదేవుడు వేరని మతానికో దేవుని సృష్టించుకుని పోట్లాడుతున్నారు.

"ఏకంసత్ - విప్రాబహుధావదంతి. ఇంద్రం యమం మాతరి - శ్వానమా హుః" అని శ్రుతి.

10. కం. హరిహరుల రూపమొకటే
ధరలో ప్రత్యయము నందె దనరును భేదం
బిరవుగనిది యెరుగరుసుమి
పెర లెన్నెతిగిననుగాని వినుమా యార్యా !

హరిహర శబ్దాలు రెండిటికి 'హృఞ్ హరణే' అనేదే మూలం. ప్రత్యయమనే పదానికి వ్యాకరణ శబ్దానికి విధించే వర్ణకం అనగా విభక్తి అని నమ్మకమని రెండర్థాలున్నవి. ధాతువనగా శబ్దానికి కారణమైన మూలరూపం.

ధాతువు ఒక్కటే అయినా వేర్వేరు ప్రత్యయాలతో వేర్వేరు రూపాలు పొంది వేర్వేరర్థాలనిస్తుంది. ఉదాహరణకు హరిహర శబ్దాలు రెండింటికి హృఞ్హరణే అనే మూలధాతువొకటే - హరణే అనగా హరించుట అని అర్థం. దీనికి ఇన్ ప్రత్యయంచేరి హరియని, అచ్ప్రత్యయంచేరి హర అనే రూపాలేర్పడినవి.

హృఞ్ ధాతువుకు ఏర్పడిన ఈరూప భేదాలలో హరిహరులకు వేషభేదం గూడ ఏర్పడి ప్రజలకు శివుడు వేరు, కేశవుడు వేరు అనే నమ్మకం దృఢపడి పరస్పరం మా దైవమే గొప్ప మా దైవమే గొప్ప అని పోట్లాడుకునే స్థితి ఏర్పడింది. దీన్ని చూచియే తిక్కన మళ్లి ఆ హరిహరులిద్దరిని కలిపి ఒకే రూపంగా చేయవలసివచ్చింది. ఈపని అంతవరకే శంకరాచార్యులేనాడో చేసినాడు. ఇపుడు తిరుపతిలో ఉండే వేంకటేశ్వరుడు హరిహర రూపమేనని శ్రీ ఓగేటి అచ్యుత రామశాస్త్రిగారి అభిప్రాయం.

11. కం. ధరలో తల్లియు దండ్రియు
అరయంగా నాదిగురువులందు వలనయే
నరులైన వారి గొల్వక
మెరుగెక్కునె జీవితంబు వినుమా యార్యా !

తల్లి-తండ్రి అనే రెండు పేర్లు ఆదిగురువులుగల పదాలు. ఇవి హ గణాలు అనగా సూర్యగణాలు. ప్రపంచంలో పుట్టిన వారందరికి తల్లిదండ్రులే మొదటి గురువులు. కనుక వారిని సేవించని వారి జీవితం ఎప్పటికి రాణించదు.

12. కం. కనిపించని కమ్మదనం
బనిపించును చెవికి పెదవి కమ్మపిలుపనన్
అనినను నమ్మాయనగా
వినినను నందెంతహాయి వినుమా యార్యా !

కమ్మన, కమ్మని అనేవి తెలుగులో మాధుర్య వాచకాలు. కనుక "కమ్మ" అనేదానిలో కకారం పొల్లు లోపించినపుడు అది "అమ్మ" అని మిగిలి పోతుంది. అందుచేత అమ్మ అనే పిలుపులో కనిపించని క + అనిపించని అనగా కకారపు పొల్లు వినిపించని కమ్మదనం ఉంది. ఇక లౌకికంగా చూస్తే - అమ్మ అన్నది ఒక కమ్మని మాట అనేది ఒక వెండితెర సూక్తి. మన భాషలో స్త్రీలను పిలిచే వరుసలు మరెన్ని ఉన్నా అవి అమ్మ అనే పిలుపులోని మాధుర్యానికి సరిరావు.

13. కం. అమ్మయు నాలున్నిలిచిన
అమ్మకె తొలివిలువ వలయు నక్షరసత్యం
బిమ్మహిని దీనినెరుగరు
పిమ్మటి బుద్ధుల జనంబు వినుమా యార్యా !

అక్షరసత్యం = చెఱిగిపోని నిజం - అక్షరాల ప్రకారంవచ్చే నిజం తల్లియా - పెండ్లాము అనేది పురుషులకీనాటి సమస్యే గాదుకాని తల్లి తనను వ్యక్తిత్వం వచ్చినంత వరకు పెంచి విద్యాబుద్ధులు నేర్పిన పిమ్మటనే పెండ్లాము వచ్చి అతని జీవితంలో పాలుపంచుకుంటుంది. లేకుంటే లేదు. అందువల్ల తల్లికే మొదటి ఓటు. ఇది అక్షర సత్యం అనగా చెరగిపోని నిజం. అక్షర ప్రకారంగా నిఘంటువులో చూస్తే "అమ్మ, ఆలు - జనని, జాయ - తల్లి, పెండ్లాము" అనే జంటలలో

మాతృవాచకాలే సతీవాచకాలకంటే మొదటవస్తవి. కనుక తల్లికే మొదటి స్థానమనేది అక్షరశః నిజమైన నిర్ణయం.

14. కం. నాయన్న, సర్వరూపం
బీయుగమున నాన్నగనుక నేరికినైనన్
నాయన లేకుండిన యెడ
వేయుండిన నేమిగాక వినుమా యార్యా !

నాయన అనుపదం నా+అన అనేదాని రూపం యడాగమం వచ్చి నాయన అవుతుంది. దాని సంక్షిప్తరూపం నాన్న, కనుక నాయన అనగా నాయొక్క అనే సర్వస్వానికి అతడు కర్త. అందువలన అటువంటి నాయనలేనపుడు వేయి అమరికలుండుగాక ! అవి తండ్రిలేని లోటును తీర్చజాలవు.

15. కం. కఱవం గరవం కొమ్ములు
దిరిగిన గురువగునుగాని తేరకుగురువై
తిరిగినయంతం గురువా
పిరువీకై లఘువుగాక వినుమా యార్యా !

కఱచుట = నేర్చుట, కఱవంగరవన్ = నేర్వగా నేర్వగా అనగా చదువగా చదువుగా ననుట.

కొమ్ములు దిరిగి - అనే భాషీయం - విద్యలో ఆరితేరు అని రూఢిగా ఉంది.

భారతదేశంలో గురుస్థానం చాలాగొప్పది.

శ్లో॥ గురుబ్రహ్మ గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః
గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవేనమః

అని గురువును మనవారు కేవలం త్రిమూర్తుల కంటే గొప్పవాడైన పరబ్రహ్మగానే భావించినారు. జ్ఞానమే బ్రహ్మస్వరూపం. కనుక పరబ్రహ్మ అనగా విజ్ఞాన ఘన స్వరూపం అని భావించవలె. అట్లా విజ్ఞానమయుడైన వాడే గురువు - లేకుంటే అతడు లఘువే అనగా గురువని పేరుపెట్టుకున్నా, సామాన్యుడే.

శ్లో॥ గుకారస్త్వం ధకారశ్చ - రుకారస్తన్నిరోధకృత్
అంధకార వినాశత్వాత్ - గురు రిత్యభి ధీయతే

అని గురుగీతా వచనం. శిష్యునిలోని అజ్ఞానాంధకారత్వాన్ని తొలగించేవాడే నిజమైన గురువు. అందుకతనికి నిరంతరాధ్యయన మవసరం. అనేక విషయాలు చదివి చదివి అతడు బోధనలో ఆరితేరి ఉండవలె. అందుచేతనే ఈపద్యంలో కరవం గరవం కొమ్ములు దిరిగిన అని చెప్పబడింది.

ఇక గరవ శబ్దాన్ని చూడండి. దీనిలో ప్రతి అక్షరానికి కొమ్ములు పెట్టండి అది గురువు అనే పేరవుతుంది. ఇది ఇందులోని శబ్ద చమత్కారం.

16. కం. అరయగ నాచార్యుండగు
గురువే గురు వేగునుసుమ్మీ కుతలంబందున్
నరులందున సురలందున
పెరిగిన పదమనితదెపుడు వినుమా ఆర్యా !

సంస్కృతంలో "ఆచార్యాః" (U U U) అనే పదం ప్రత్యక్షర గురువు. కనుక ఆచార్య శబ్దవాచ్యుడైన వాడే లోకంలో నిజమైన గురువు.

శ్లో॥ ఉపనీయతు యః శిష్యం వేదమాధ్యాపయేద్విజః
సకల్ప సరహస్యంచ - తమాచార్యం ప్రచక్షతే -

ఎవడు ఉపనీతుడైన శిష్యునితో వేదం కల్పంతో గూడ రహస్యం వివరించి చదివిస్తాడో అతడే ఆచార్యుడని ఆచార్య నిర్వచనం.

17. కం. తల్లియు దండ్రియు గురువును
యెల్లరకును సమమే వీరికెల్లరకంటెన్
తెల్లముగ హెచ్చు దైవము
ముల్లోకములందునైన పోల్చగనార్యా !

తల్లి - తండ్రి - గురువు అనే ముగ్గురు ఎవరికైనా అనగా ఏమతంలోనైనా సమానంగా చూడబడవలసినవారే. అదెట్లాగో గమనించండి.

తల్లి - తండ్రి - గురువు ఈమూడు పేర్లుగూడ మూడేసి మాత్రలు గలవే. అందువల్ల ఈ ముగ్గురు మాత్రం అందరికి సమానమైన దేవతలే

అవుతారు. అయితే వేదం మనకు మాతృ దేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అని ఉపదేశిస్తున్నా సృష్టికర్తయైన ఆ ఈశ్వరుడు మాత్రం "దైవం" అనే శబ్దానికి నాలుగు మాత్రలు కాబట్టి అతడు పైవారికంటె మాత్రం ఎక్కువవాడే అవుతాడు.

18. కం. స్త్రీనామమె మధురంబని
నానుడి తత్తుల్యమగుట నాంధ్రమ్మునకున్
బూనెను మధురమ్మును జన
ప్రీణనమును జగతియందు వినుమాయార్యా !

ఇది తెలుగు భాషను గురించిన విషయం.

సూ॥ "సంస్కృతసమేతరంబయిన ఈభాష యచ్చయనం బడు" - బా. ఆచ్చి-1 అని సూరిమాట. ప్రస్తుతం మనభాష, భాషలోని పదాలు తత్సమం, తద్భవం, దేశ్యం, గ్రామ్యం అనే నాలుగు విధాలుగా ఉన్నవి. వానిలో తత్సమం తప్ప, తక్కిన మూడు కలిసి ఆచ్ఛికం క్రిందికే వస్తవని సూరిమతం. ఆచ్ఛికం అనగా అచ్ఛమైనది. కల్మష రహితమైనదని అర్థం. ఇది తెలుగు భాషకు వ్యాకరణ వేత్తలు పెట్టిన మరోపేరు.

సూ॥ "ఆచ్ఛికంబు వెల్లం దలఁచుగ స్త్రీసమంబులు క్లీబసమంబులై యుండు". బాల వ్యాకరణం ఆచ్ఛికం - 2. అనగా తెలుగు పదాలన్ని సాధారణంగా స్త్రీలింగాలవలె నపుంసక లింగాలవలెనే వుంటవని పై సూత్రానికి అర్థం. ఆరెండింటిలో మళ్లి ఏవి ఎక్కువ అంటే స్త్రీలింగ సమాలే ఎక్కువనవలె. లేకుంటే సూత్రంలో క్లీబసమంబులనే దానికే సూరిప్రథమ స్థానం ఇచ్చేవాడు.

"స్త్రీ తినామాపిమధురం" అని ధ్వనికారుని మాట. సహజంగా స్త్రీలు ప్రకృతి మధురలు. అందులో గూడ శకుంతలవంటి కొందరు సర్వావస్థలలో గూడ మధురలుకాని, ఆనందవర్ధనుడు "స్త్రీయే కాదయ్య స్త్రీ అనే పేరుగూడ మధురమే" అంటాడు.

ఆచ్ఛికం అనగా తెలుగు. అది స్త్రీ సమంగాబట్టి యిక అదిగూడ మధురం కాకుండా ఎట్లా ఉంటుంది. సూరిమాట ప్రకారం అదిగూడ మధురమే అవుతుంది.

తెలుగు అనే పేరుకు కొందరు లాక్షణికులు తేనె + అలుగు అనే వ్యుత్పత్తి గూడ చెప్పినారు. కాబట్టి ఆపక్షంలో మాధుర్యానికిక సందేహమేలేదు.

19. కం. రణముండున్ వ్యాకరణం
బున సాధువనుచు వటువులందుచే
తనే సుధ్యుపాస్యనుండియె
చిన చిన్నగ జారుచుండ్రు చెప్పగ నార్యా !

శ్లో॥ యద్యపి బహునాధీతే తధాపి పఠపుత్ర వ్యాకరణం
స్వజనః శ్వ జనోమాభూత్ సకలం శకలం సకృత్ శకృత్
ఆ విదిత శషస విశేషా వాణి, వక్త్రా ద్వినిర్గతా యేషామ్
గుదవదన వివర భేదోఽరదనై రేవోపలక్ష్యతే తేషామ్.

తా॥ నాయనా ! నీవు ఎక్కువ శాస్త్రాలు చదువక పోయినా సరేగాని, వ్యాకరణం మాత్రం తప్పక చదువు. లేకుంటే నీనోట స్వజనం శ్వజనం కాగలరు. సకలం శకలం సకృత్ శకృత్ కాగలదు. కాబట్టి శ షల గుర్తింపు లేకుండా మాటాడే వాని ముడ్డికి మూతికి దంతాలు తప్ప భేదం ఉండదని భట్టి కొంచెం గట్టిగానే మందలించినాడు.

స్వజనం = తనవారు, శ్వజనం = కుక్కలవారు
సకలం = సమస్తం, అంతా; శకలం = ముక్క, కొలది భాగం
సకృత్ = అరుదు, శకృత్ = మలం

ఇవి వీని అర్థాలు. కనుక విద్యావంతులు వ్యాకరణం తప్పక ఎరిగి శబ్దపరిచయం కలవారై ఉండవలె.

అయితె వ్యాకరణం అనే పేరులో రణం ఉన్నట్లే వ్యాకరణశాస్త్రంలో గూడ పదం సాధువు, ఇది అసాధువని వానిపై పెద్దయుద్ధమే ఉంటుంది. అందువల్ల వ్యాకరణమంటె కొందరికి భయం, మరికొందరికి బోరు. శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రి గారివలె వ్యాకరణాన్ని గూడ కావ్యపాఠంవలె సరసంగా చెప్పగలవారు వ్రేళ్లపై లెక్కించదగినవారే. అందుచేత హైస్కూళ్ళలోగాని, కళాశాలలలోగాని తెలుగు పీరియడులోని వ్యాకరణం క్లాసు నిదాఘపూరంవలె ఉంటుంది.

ఈ పరిస్థితి ఈనాటిదేగాదు, పూర్వంనుంచి ఉన్నదే. ఒక ప్రాచీన పండితుడు తన వ్యాకరణం క్లాసునుగురించి

శ్లో॥ కేచిద్భగ్నే సుద్ద్యుపాస్యేతి సూత్రే కేచిద్భగ్నే యుష్మదస్మత్థలేషు
కేచిద్భగ్నేకారకే తద్ధితేచ సర్వం భగ్నా ఉత్తరార్థస్థలేషు

అని యేవిధంగా వాపోయినాడో చూడండి. సంధి పరిచ్ఛేదంలో సుద్ద్యుపాస్యః అనే సూత్రమే మొదటిది. కాబట్టి పాఠ ప్రారంభంనాడే కొందరు జారుకున్నారట. అందువల్ల ఈనాటి ఉపాధ్యాయులుగూడ తమ పాఠ ప్రవచనంలో విద్యార్థుల నావిధంగా బెదిరిపోయేటట్లు చేయవలదని మనవి.

20. కం. కళయెల్లయొకటి జగమున
నరయగ ద్రుతమెల్లనొకటియా రెండెల్లల్
దెలిసినది చదువు చదువున
వెలవెలగని చదువు చదువె వినుమాయార్యా !

భాషా ప్రపంచంలో రెండెల్లలున్నవి. ఒకటి కళ రెండవది ద్రుతప్రకృతికం. సీమాపర్యాయమైన ఎల్ల శబ్దం కళ. కాని సర్వపర్యాయమైన ఎల్ల కళకాదు. అది ద్రుతప్రకృతికం అని సూరిమతం.

కళ అనగా స్థిరమయింది. ద్రుత ప్రకృతికం అనగా కరిగిపోయేది. "నకారంబు ద్రుతంబు" అని బాలవ్యాకరణం కనుక అది చివరగల పదాలు ద్రుతప్రకృతికాలు అయినవి.

అదేవిధంగా ఈ ప్రపంచంలో గూడ ఒకటి కళ అనగా శాశ్వతమయింది. ఒకటి ద్రుతం అని రెండు పదార్థాలున్నవి. వేదాంతశాస్త్రం "బ్రహ్మసత్యం జగన్మిధ్య" అని చెబుతుంది. కనుక బ్రహ్మ పదార్థం శాశ్వతమయింది కనుక అది కళ. ఈ జగత్తు ప్రళయంలో కరిగిపోతుంది కాబట్టి అది ద్రుతప్రకృతికం. భాషలో కళాద్రుత ప్రకృతికాలు సరిగా గుర్తించగలిగిందే చదువు. అదేవిధంగా వేదాంతంలో గూడ ఏదిశాశ్వతం, ఏదశాశ్వతం ఆరెంటిని గుర్తించగలిగిందే నిజమైన చదువు. ప్రహ్లాదుడు "చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ !" అంటాడు. అంటే అతడు ఈ ప్రపంచమంతా అతని దివ్య కళామయమని కళను మరియు

ద్రుత ప్రకృతికాన్ని రెండిటిని తెలుసుకున్నాడు కనుక మనం గూడ అట్లా తెలిసికోగలిగిన చదువే నిజమైన చదువు.

21. కం. తలక్రిందుగనేబీలను
వెలిగించినయంత విద్య విద్యాయందున్
గలసారమెరుగ కుండిన
విలువేమిటి దానిచేత వినుమా యార్యా !

తలక్రిందుగ - అనే భాషీయానికి తెలుగులో తారుమారు అనే రూఢిగూడ ఉంది. A, B అనేవి ఆంగ్లంలో మొదటి రెండక్షరాలు. తారుమారైనపుడు B.A. అనే డిగ్రీ అవుతుంది. B.A. చేస్తే ఈనాటి చదువు చాలావరకు పూర్తి అయినట్లే. విద్యార్థి కష్టపడి ఈ A, B లను తారుమారు చేయవచ్చుగాని అప్పటివరకు అందున్ అనగా ఆ ఆంగ్లవిద్యలోని సారమేదో తెలిసికోలేకపోతే తాను B.A. అయినా M.A. అయినా లాభంలేదనియే అర్థం.

22. కం. తానుత్తమ మెదుటనుగల
మానవుడు మహాత్ముడైన మధ్యమయనుచున్
దీనినిగఱచును పండిత
మాని గాన సహము విడిచి మనవలె నార్యా !

తానుత్తమ, ఎదుటివాడు మధ్యమ, ఎక్కడనో గలవాడు ప్రథమ అని వ్యాకరణంలో పురుషలకు గల సూత్రం. ఈ సూత్రం వ్యాకరణంవరకే ఉండవలెగాని జీవితంలో అన్వయించుకోరాదు. కాని పండితుడెపుడు తానే ఉత్తముడనని, ఎదుటివాడు ఎంతవాడైనా తనకు లొచ్చేనని పై సూత్రాన్ని మరోరకంగా అర్థం చేసికుంటున్నాడు. కాబట్టి మానవు డెప్పుడైనా నేనే ఉత్తముడననే అహంకారం విడిచి జీవించవలె.

23. కం. క్షమలో నాపదసంపద
సమమాత్రగ నెరుగునెవడు చదువరియతడే
సుమియెంత చదువనేమిటి
కమిచి కమిచి దీనిగనక కనుమా యార్యా !

ఆపద - సంపద వ్యతిరేక ద్వంద్వమైన ఈ రెండు పదాలు సమాన మాత్రలుగలవే కాక ఏకగణాలుగూడ. అందుచేత ఆరెండు సమానమైనవి. ప్రపంచంలో ఆపదలు సంపదలు రెండు సమానమే కాబట్టి ఆరెంటిని ఆవిధంగా సమదృష్టితో చూడగల సమానభావం అనగా సంపదకు పొంగటం, ఆపదకు క్రుంగటం అనేది లేకుండ ఉండే లక్షణం వ్యక్తికి విద్యవల్ల కలుగవలె. అది కలుగనినా డెంత చదివినా లాభం లేనిదే అవుతుంది.

24. కం. తావర్ణభ్రష్టముగా
జీవమ్ము నశించిపోయి చెడునుచరితమున్
గావున నటుగాకుండక
వేవిధముల నుండవలయు వినుమా యార్యా !

తావర్ణభ్రష్టముగాన్ = తానువర్ణ భ్రష్టుడై పోగా, తకారం చెడిపోగా, ఏ భాషలోనైనా అందలి పదాలలో ఏదో ఒక అక్షరం ఆపదానికంతా జీవభూతంగా ఉండి అది చెడిపోయేవరకు ఆ పదం నిరర్థకమవుతుంది. ఉదాహరణకు అటువంటి దానిలో చరితము అనేది కూడ ఒకటి. దానిలో తకారం లోపించే వరకు 'చరిము' అని అది అర్థరహితమై పోతుంది. అదే విధంగా వ్యక్తిగూడ తాను వర్ణభ్రష్టుడైనపుడు అనగా కులమేగాదు, కులానికి తగిన ఆచార ధర్మాలలో భ్రష్టుడైనపుడు అతని చరిత్రగూడ ఆలాగే అర్థరహితమైపోతుంది.

25. కం. కులమునకాతలనుండిన
నిలనాకుల మగుట దప్పదింద్రునకైనన్
వలదది యెవ్వరికైనను
మెలపు జెడును జగతియందు వినుమా యార్యా !

ఆతల = అవతల, ఆతలనుండిన = అవతలనున్నయెడల, ఆకారం తలలోనున్నయెడల - కులం - ఆకారం తలలోనున్నపుడు - ఆకులం = కష్టం.

లోకంలో ఎవరైనా సరే తమకులానికి అనగా సంఘానికి అవతలున్నపుడు అతడు బహిష్కృతుడు గావచ్చు లేదా మరే కారణంచేతనైనా కావచ్చు - అపుడు మాత్రం అతనికి కష్టాలు తప్పవు.

విశ్వరూపుని చంపినపుడు ఇంద్రుని బ్రహ్మహత్య పిశాచిరూపంలో వెంటబడింది. అపుడతడు స్వర్గంలో ఉంటే యిదినన్ను విడువదని దాన్ని విడిచి దూరంగా ఈశాన్యంవైపు పారిపోయి ఎక్కడనో ఒక సరస్సులోని తామర కాడలలో దాగి అనేకమైన ఇబ్బందులు పడినాడు. కాబట్టి యిల్లువిడిచి లేదా కులం విడిచి దూరంగా ఉన్నపుడు ఇంద్రునికైనా కష్టాలు తప్పలేదు. కాబట్టి ఇక మానవులొక లెక్కనా !

26. కం. తాజెడిమసియగు తామసి
యేజగమున నున్నగాని ఇది నిక్కము సు
మ్మీ జనుడు దీనినెరిగిన
వేజన్మములైన జెడదు వినుమా యార్యా !

తామసి = తామసగుణంగలవాడు; తాజెడి = తాను చెడిపోయి - తకారం చెడిపోయి - తామసి అనేపదంలో తకారం చెడిపోతే మసి అనేదే మిగులుతుంది.

తామసగుణం కలవాడు కూడ అంతే. అతడేదేశంలో ఉన్నా తానుచెడిపోయి మసిగానే మిగులుతుంటాడు.

27. కం. వదలును ప్రాజ్ఞుడు కామన
తుదమొదటికి వచ్చినపుడు తోచక జడుడున్
కిదుకును వదలయు వదలడు
మెదలలేడు దానివిడిచి వినుమా యార్యా !

తుదమొదటికి వచ్చినపుడు = ఈ భాషీయం ఆరంభించిన పని మళ్ళీప్రారంభం నుంచి చేయవలసిన వచ్చినపుడు అనే అర్థంలో రూఢిగా ఉంది.

కామన = కోరిక. ఈపదంలో తుదమొదటికి రాగా అనగా చివరి అక్షరం మొదటికి చేరితే అపుడది నకామ = కోరవద్దు అని అవుతుంది. కాబట్టి ప్రాజ్ఞుడైన వాడు అనగా కర్మరహస్యం తెలిసినవాడు అట్లాతాను చేసినపని మళ్లిమొదటికి వచ్చినపుడు దాన్ని నిర్మమకారంగా విడిచిపెడతాడు. మళ్లి మొదలెత్తుకోడు. కాని జడుడు అనగా ఏదీతోచని వాడైతే దాన్ని విడువలేక, మళ్లి ఆరంభించలేక తన్నుకులాడుతుంటాడు.

28. కం. నిజముగ వాకొనగా న
క్కజముగ గలవాడె కలడు కాని యన్యుడున్
అజుడును నభవుండును కా
యజుడైనను లేని వాడే యనుమా యార్యా !

కలవాడు = ఉన్నవాడు, స్థితిమంతుడు; వాకొనగా = చెప్పగా వకారం అనే అక్షరం తీసికోగా తీయగా - కాశీఖండంలో అగస్త్యుడు లక్ష్మీదేవిని

ఆ. కమలనయన నీవుగలవాడు కలవాడు
లేనివాడు నీవు లేనివాడు

అని నుతించినాడు. కాబట్టి ప్రపంచంలో లక్ష్మి ఉన్నవాడే ఉన్నవాడు. ఆమెలేనివాడు లేనివాడే. పై పద్యంలో యిదే విషయం ప్రతిపాదింపబడింది.

నిజానికి చెప్పవలెనంటే ప్రపంచంలో కలవాడే ఉన్నవాడు, లేనివాడున్నా లేనట్టేలెక్క.

కలవాడు అనేపదంలో వకారాన్ని మనం తీసినా అది "కలడు" అని సామాన్యార్థమే మిగులుతుంది. కాని వ్యతిరేకార్థంగాని మరోటికాని మిగలదు. ఇది ఇందులోని చమత్కారం.

ఇక లక్ష్మిలేనివారిలో అజుడు, అభవుడు, కాయజుడు అనేవారిని పరిశీలించండి. అజుడన్నా, అభవుడన్నా పుట్టనివాడు అనే అర్థంకాబట్టి పుట్టనివాడు ప్రపంచంలో ఎట్లాగు ఉండనే ఉండడు.

శ్రీ శబ్దానికి లక్ష్మి అనేకాక సరస్వతి, పార్వతి అనే అర్థాలు గూడ ఉన్నవి కాబట్టి వారు లేనపుడు అవాక్కై బ్రహ్మ, అర్థ శరీరియై శివుడు ఉన్నా లేనివారే అవుతారు. ఇక మన్మధుడో ఎపుడో సశరీరంగా ఉన్నా శివుని కంటి మంటలో భస్మమై యిపుడేలాగు అనంగుడే అయినాడు కాబట్టి "లక్ష్మీకటాక్షం లేనపుడుదాహరణంగా చెప్పబడిన బ్రహ్మవంటి సృష్టికర్త, శివునివంటి సర్వజ్ఞుడు, మన్మధునివంటి రూపవంతుడు గూడ లేనివారిక్రిందనే లెక్క" అని తాత్పర్యం.

29. కం. పాపములను మూచూడని
రూపముసుమి పాపలనగ పృథివినందుకే

చూపరకు ముద్దువత్తురు
కాపురమెటులున్నగాని కనుమా యార్యా !

మూచుచు = ముక్కుతో వాసన చూచు, మూచూడని = వాసనచూడని అనగా ఎరుగని - మువర్ణకంలేని.

పాపము అనే పదం మువర్ణకం లేకుంటే పాప అవుతుంది. అందుకే పాపలు "పాపం మూచూడని వారు" అని ఇందులోని చమత్కారం.

టాల్‌స్టాయ్ మహాశయుడు పాపలు పాపాన్నెరుగరని అన్నాడు. అందుకే వారు ఎటువంటి కుటుంబంలో పుట్టినా తమ మనోనిర్మలత్వంలో చూచే వారికందరికి ముద్దువస్తూనే ఉంటారు.

30. కం. **చెలువము తలలో వక్రత**
గలుగుటకాబోలు గర్వకారణమదియున్
చలువేది దాని వలనను
వెలదికైన విభునికైన వినుమా యార్యా !

చెలువం = అందం, వక్రత = వంకరతనం, ఏఓలు వక్రతరములని, ఐఔలు వక్రతమములని ప్రాచీనులు వ్యవహరింతురని బాలవ్యాకరణం కనుక వక్రత అనగా ఇక్కడ ఏత్వ చిహ్నమని అర్థం.

అందం మనిషికి ఒకగర్వకారణం కనుక అందం ఉన్నచోట తప్పకుండా రూపగర్వం కొంతైనా ఉంటుంది. ఆ గర్వలక్షణం వారిబుర్రలో ఎందుకుంటుంది అంటే ఇక్కడ తలలో అనగా మొదటి అక్షరం యొక్క తలలో ఏత్వం ఉండటంచేత అని సమర్థన - కాని దానివల్ల స్త్రీలకైనా, పురుషులకైనా చలువ అనగా చిత్తశాంతి ఉండదు. అదిఎందుకనగా చెలువం అన్నపుడావిషయం దానియొక్క తలలోనే వక్రత ఉంది కనుక అది ఉండేవారిలో ఆ చిహ్నమైన గర్వం కొంతైనా ఉంటుంది. కులగర్వం, ధనగర్వం, రూపగర్వం లోకంలో సహజం కనుక ఇది రూప గర్విష్ఠులను గురించి చెప్పినమాట. ఉధాహరణంగా సత్యభామను గ్రహించవచ్చు. ఆమెకు శ్రీకృష్ణుని భార్యలందరిలో తానే రూపవతినని గర్వమున్నది కాని అది కాస్త తులాభారం నాటకంతో పటాపంచలై పోయింది. కాబట్టి రూపగర్వం ఎవరికీ

కూడదు. వెలది - అనగా వెలగది అనగా ఎంత విలువైన స్త్రీకైనా, విభుడు అనగా అన్నిటిపై అధికారంగలవాడు, గొప్పవాడు అని అర్థం కాబట్టి ఎంతగొప్ప అధికారంగల లేదా గొప్పవాడైన పురుషునికైనా అని అర్థం.

31. కం. కనగననాదిగ పాయము
ననపాయమె యగునుగాని యటనరగడయున్
జనులందును గాదెప్పుడు
మనమునసీ తత్వమెరిగి మనుమా యార్యా !

అనాదిగ = పూర్వంనుడి, అన+ఆదిగా అన శబ్దం మొదట చేరగా న (అన్) + ఆదిగ మొదటి అక్షరం లేనిదిగా పూర్వంనుండి పెద్దలు, పాయం = వయసు ప్రమాదకారి అన్నారుకాని శబ్దరీతిగా అనగా అన చేరగా అది అనపాయం అని ఏర్పడి అపాయకారి కాదనియే సూచిస్తుంది.

అరగడ = ముసలితనం ఇందులో అకారం పోగా రగడ అని మిగిలి అది ఘర్షణను సూచిస్తుంది. కాబట్టి పూర్వంనుండి పెద్దలు వయసు ప్రమాదకారి అని ముసలితనం శాంతికి మూలం అన్నారుకాని అట్లాకాదు. వయోదశనే అనపాయంగా ఉండి, ముసలితనం అనేకమైన మానసిక సాంసారిక ఘర్షణలకు మూలమై ఉంటుంది.

32. కం. నాగరికత యందేదియొ
బాగుగల దటంచు ప్రజలు భ్రమసెదరందున్
ప్రోగైన గరికగానరు
వేగిన పాటునను జనులు వినుమా యార్యా !

నాగరికత = నగర సంబంధమైన నాణ్యత, అనగా సిటీఫ్యాషన్. ఈనాడు ప్రజలందరు బస్తీ వేషభాషల్లోనే ఏదోమంచి ఉందని వానికి ఎగబడుతున్నారుగాని నాగరికతలో తుదమొదలుగల అక్షరాలు తొలగిస్తే అందులో మిగిలేది గరిక అంటే వట్టిగడ్డి మాత్రమే. ఈనాటి విదేశీయ నాగరికతగూడ అంతేగాని ప్రజలింకా దానిలో దాగిన ఈ సత్యాన్ని కనుక్కోలేక పోతున్నారు.

గఱిక శకటరేఫ పదం. కాని శ్లేషలో ఉభయరేఫల భేదం అంతగా పాటించరు. కాకుంటే ఈ నాగరికతలోనిది సాధుగరిక అనవలె.

33. కం. కొమ్ములు దిరిగిన పరుషం
బిమ్మహిలో పురుషుడనగ నెదకఠినమగున్
సుమ్మీ యందులకేని
క్కమ్మతనికి జగతియందు కనుమా యార్యా !

కొమ్ములు దిరిగిన అనే జాతీయం యొక్క అర్థం ఇంతవరకే 15వ పద్యంలో చెప్పబడింది. అదే అర్థం యిక్కడ గూడ అన్వయిస్తుంది. కనుక పురుషుడంటే అది కొమ్ములు దిరిగిన పరుషమే. పురుష శబ్దంలో ఒక్క రేఫకు మాత్రమే కొమ్ముందిగాని పురుషుడన్నపు డన్నింటికి కొమ్ములుంటవి. కాబట్టి అందుకొఱకే అతడు కొమ్ములుదిరిగిన పరుషరూపం. ఆ కారణంగానే పురుషుల హృదయం స్త్రీలకంటే కఠినంగా ఉంటుంది.

34. కం. రాజును సాధించుటసులు
వేజగమున సూరికైన వెంకటరమణా
ఓజన్ విశ్వామిత్రము
చేజేతుల నెంతసలుప చెప్పగనార్యా !

రాజును సాధించుట = రాజుగారిని సాధించి వశపరుచుకొనుట; రాజు శబ్దాన్ని సాధించుట. సంస్కృతంలో రాజ శబ్దం రాజన్ అని నకారాంత పుంలింగం, కర్మన్, వర్మన్, శర్మన్ అనేవి గూడ అటువంటివే. అయితే ఈ కర్మన్, వర్మన్ తత్సమాలైనపుడు నకారంలోపించి స్త్రీలింగంవలె నిలుస్తవి. లేదా ఉత్వడుజ్‌లు చేరి పుంలింగాలౌతవి. కాని రాజశబ్దం అట్లా స్త్రీలింగం పుంలింగం రెండు గూడకాక రాజు అని నిలుస్తుంది. సంస్కృతంలో దంత్య చకారంలేదు. ఇది సూరి సూత్రం చేత సాధ్యపడదు. అందుచేత చిన్నయసూరిఅంతటివాడే దీన్ని "రాజు శబ్దం బొక్కటి దంత్యయుక్తంబయి గానంబడియెడు" అని నిపతించి ఊరుకున్నాడు.

ఇట్లా రాజుశబ్దం సాధించటం భాషలో ఎంతకష్టమో రాజును వశపరచు కోవటం లోకంలో గూడ అంతే కష్టం. అక్కడ ఏ విశ్వామిత్రం అంటే అతడు హరిశ్చంద్రుని మాటలతో కట్టివేసినట్లు మనయొక్క ఏయుక్తి గూడ అక్కడ సాగదని తాత్పర్యం.

35. కం. రాగలిగినట్టి జన్యు డె
ఓగుగలుగు వేళ జనుల నొగిగావగవా
దేగద రాజన్యుడు భువి
భోగములకు గద్దెనెక్కు పురుషుడె యార్యా !

జన్యుడు = పుట్టినటువంటివాడు అనగా మానవుడై జన్మించినవాడు. ఓగుగలుగు వేళ = ప్రక్కవారికి కీడు గలిగినపుడు ఆదుకొనుటకు లేదా రక్షించుటకు రాగలవాడే రాజన్యుడు అనగా పట్టభద్రుడైన రాజు గాని కేవలం భోగం అనుభవించటానికి గద్దెనెక్కిన వాడు రాజుగాడు అని ఈ పద్యంయొక్క తాత్పర్యం.

జన్యుడు అనే శబ్దానికి మొదట 'రా' కలిగిపుడు అనగా చేరినపుడు ఆ పదం రాజన్యుడు - అవుతుంది కాబట్టి యిది దీనిలోని శబ్ద చమత్కారం.

సంస్కృతంలోని క్షత్రియ శబ్దానికి గూడ "క్షత్రాత్ త్రాయతేక్షత్రః అస్యాపత్యంక్షత్రియః" - అనగా "క్షతం" శత్రువులయొక్క దెబ్బనుండి కాపాడగలవాడే క్షత్రియుడని అర్థం - సామాన్యులు "ఆవుల మలిపినవాడే అర్జునుడు" అని వాడుకొనే సామెత గూడ పై విషయాన్నే బలపరుస్తుంది కాబట్టి ప్రజలను కాపాడకుండ ఎవరు గూడ ప్రభువులు కాజాలరు.

అట్లాగే వారిని సత్క్రమమార్గంలో కొనివెళ్లనివారు నాయకులనబడరు.

36. కం. దాదాపు సలక్షణములు
నౌధారుణి దాసలక్షణంబులుగా నన్
వాదాడకు వారలగని
పేదరికపు తీరు జూచి వినుమా ఆర్యా !

దాదాపు = దగ్గరదగ్గరగా, దకారానికి సమీపంగా

దాదాపు సలక్షణములు = దకారం దగ్గరగా ఉండే సలక్షణం అనగా దాసలక్షణం.

దాసులయొక్క లక్షణాలన్ని, ఒక్కొక్కప్పుడు కొంతవిపరీతంగా కనిపించినా అవి దాదాపుగా సలక్షణాలే అయిఉంటవి. కాబట్టి వారిని చూచి మీకిదేమిటి యిట్లా అని వాదులాడి వారిని అవమానించటం మంచిదిగాదు.

37. కం. కపటియందు గనిపించెడి
దెపుడును పరుషంబెగాన నెరిగిన వారల్
నెపమున్నను స్నేహించరు
విపులించగ నేలదాని వినుమా యార్యా !

పరుషం = కఠినం - పరుషాక్షరం.

సూ॥ కచటతపలు పరుషంబులని గజడదబలు సరళంబులని చెప్పంబడు. బాల వ్యా.సం. -5. కపటి అనే పేరులో పై సూత్రప్రకారం ఉండేవన్ని పరుషాక్షరాలే. కాబట్టి వానిలో పేరుకు తగినట్లు ఎపుడూ కాఠిన్యమే ఉంటుంది. కనుక ఇది తెలిసిన వారు ఏదైనా అవసరమున్నప్పటికి అటువంటి వానితో స్నేహం చేయరు.

38. కం. పేరే సరళము గాంధీజి
తీరడుగనేల వేరె తెలుపగనేలా
పేరునకు దగుమహాత్ముడు
కారణ జన్ముండ తండు గనుమా యార్యా !

గాంధీజీ అనేపేరులో ఉండే మూడక్షరాలు గూడ వ్యాకరణం ప్రకారం సరళాలేకాబట్టి పేరే అంతా సరళంగా ఉన్నపుడిక ఆయన హృదయం ఎంత సరళంగా ఉండేదో అడుగవలెనా !

39. కం. దూత జగంబున స్త్రీసమ
మాతనిచేతప్పుజరుగ, నదిమన్నింపన్
నీతిసుమా శిక్షించుట
ఖ్యాతిగాదు జగమునందు గనుమాయార్యా !

దూత = సేవకుడు, రాయబారి. ఇది స్త్రీలింగ తుల్యమైన పదం.

"దూతాదులకు స్త్రీ సత్యంబు బహుళంబుగా నగు" బాల వ్యా. తత్స - 6.1. దూతను శిక్షింపరాదని ధర్మశాస్త్ర వచనం. స్త్రీలను గూడ శిక్షించరాదనియే. శిక్షింపరాదనటానికి ఆపేరుకు వ్యాకరణ మర్యాద గూడ ఒకకోణంగా తోడ్పడుతుంది.

మహాభారత కథలో శ్రీకృష్ణుడు రాయబారిగా వెళ్లినపుడక్కడ తనను దూతగ బంపిరి అనియే చెప్పుకొన్నాడు. కాని దుర్యోధనాదులతనిని బంధించే

ప్రయత్నం చేయగా శ్రీకృష్ణుడు అవతార పురుషుడు గాబట్టి దుర్యోధనుని దుస్తంత్రం నుండి తప్పుకున్నాడు. కాని పల్నాటి చరిత్రలో అట్లాగే బ్రహ్మనాయుడు నాగమ్మ దగ్గరకు అలరాజును రాయబారిగా పంపగా ఆమె అతనిని చంపించింది - ఇది ధర్మం గాదు - చరిత్రలో ఇటువంటివి ఇంకా గూడ ఉన్నవి.

40. కం. ఇలలోన దూదికైనను
కలదు గురుత్వంబు కొంత గడ్డికినైనన్
గలదదిగాని యనదలకు
గలుగదు గోమాతతోడు, గనుమా యార్యా !

గురుత్వం = గొప్పతనం అక్షరరీతిగా గురువయ్యే లక్షణం;
అనద = అల్పుడు, అనాథ

భోజరాజీయంలో గోమాత తనబిడ్డతో

41. కం. చులకన జలరుహ తంతువు
చులకనతృణకణము దూది చులకనసుమ్మీ
ఇలనెగయు ధూళిచులకన
చులకనమరితల్లి లేని సుతుడు కుమారా ! భోజ. 6-35.

లోకంలో దూదికైనా, గడ్డికైనా కొంతగురుత్వం ఉందిగాని అనదలకు ఆమాత్రం గూడ లేదు. వారు అనగా గడ్డిపరకలకంటె హీనంగా చూడబడుతున్నారని తాత్పర్యం.

దూది గడ్డి అన్నపుడు ఈపదాలలో పూర్వాక్షరాలు గురువులు కాబట్టి వానిలో కొంత గురుత్వం ఉందికాని "అనద" లో అది ఎక్కడా కనిపించదు. ఇది ఇందులోని శబ్దవిశేషం.

42. కం. కనకనలాడెడు వాడై
వసుగతి విపరీతమైన వకనకలాడున్
గననిది వసుధను సహజము
కనుక వెనుక ముందు నెపుడుగను మీ ఆర్యా !

కనకనలాడు = మండిపోవు; నకనకలాడు = ఆకటితో స్రుక్కిపోవు.

కనకన అనే అనుకరణం విపరీతమైనపుడు అనగా తారుమారైనపుడు నకనక అని ఏర్పడుతుంది. అదే విధంగా ఎంతమండిపడేవాడైనా తనకాలం తప్పినపుడు కృశించక తప్పదు. అందుచేత మనిషి దీనినెరిగి అనగా కాలం ఎపుడు ఒకేతీరుగా ఉండదని తెలిసి నడుచుకోవలె.

43. కం. ఆడుదియన చులకనగా
జూడకుమాద్యంతమరసి చూడజగతిలో
ఆడుదియె యాది యగుసుమి
వేడబములు కావు కావు వినుమా ఆర్యా !

ఆద్యంతమరసి చూడన్ = తుదమొదలు విచారించి చూడగా అనగా లెస్సగా ఆలోచించగా మొదటి అక్షరం చివరి అక్షరం రెండుకలిసి చూడగా ఈ సృష్టి అంతా అమ్మనుండియె పుట్టింది కాబట్టి దీనికి దేవియే మూలం అని శంకరాచార్యుడు సౌందర్యలహరిలో చెప్పినాడు.

దానికి తగినట్లు ఆడుది అనేపదంలో మొదలు తుద రెండు కలిపిచూడగా ఆదియని ఏర్పడి అది సృష్టికంతా స్త్రీయే మొదలు అనేదాన్ని తెలుపుతుంది. కాబట్టి ఎవరైనా స్త్రీని ఆడది ఆడదే అని చులకనగా చూడరాదు.

44. కం. ఉత్తమమైనట్టిది తా
నుత్తపలుకుగాదు వనిత యొప్పక దీనిన్
ఉత్తదనువాడు జగమున
వేత్తయగునె తత్వమరయ వినుమా యార్యా !

ఉత్తమమైనది = శ్రేష్టమైనది, తకారం ఉత్తమంగా గలది. వ్యాకరణ శాస్త్రంలో చివరి అచ్చుకంటె మొదటి దానికి ఉత్తమం. దానికంటే మొదటి దానికి ఉపోత్తమం అని వ్యవహారాలు. వనిత అనే శబ్దాన్ని విడగొట్టినపుడు త్+ఆ అని తకారం ఉత్తమస్థానంలో నిలుస్తుంది కనుక వనితాశబ్దం ఉత్తమమయింది అవుతుంది.

శ్లో॥ వనితేతి వదంత్యేతాం, లోకః సర్వే వదంతుతే
యాసాంపరిణ తానే2 యం తపస్యేతి మతంమమ

- భామి. 2-117

వనిత; వనిత అని లోకం స్త్రీలందరిని అంటుందిగాని వనిత అంటె పురుషునికి మిక్కిలి అనురాగం గలిగించే స్త్రీ అని అర్థం. కనుక అది ఆమెకు, స్త్రీ లక్షణాలలో పరిణతురాలై ఉంటేనే సాధ్యం. అందువల్ల "వనిత" అనే పేరుకు తగినట్లుండటం అంటె అది ఆమె తపఃఫలమేకాని మరియొకటి కాదని పండితరాయల అభిప్రాయం.

45. కం. **గుడిగలదు స్త్రీకి పుడమిని**
నుడిగాదిది నిక్కవంబనూ నపదంబున్
వడసినది గుణము కలిమిని
మిడిమేలపు మాటలేల వినుమా యార్యా !

గుడిగలదుస్త్రీకి = స్త్రీ అనే శబ్దానికి కాగుణింతంలో గుడిసి ఉంది. గుడి అనగా పవిత్రస్థానం కనుక లోకంలో స్త్రీకి ఒక పవిత్ర స్థానం ఉంది. ఇది వట్టిమాటగాదు. అందువలన లోకం ఆమెను గౌరవించవలెనని భావం.

46. కం. **కనభూత పంచకంబున**
అనలపు పాలెక్కువుండు నందున స్త్రీచే
చనువైనను యనియైనను
జినుడైనను కీడుబొరయు చెప్పగ యార్యా !

స్త్రీ అనే పదంలో స్+త్+ర+ఈ అనే అక్షరాలున్నవి. వీనిలో ఒక్క తకారం తప్ప తక్కినవన్ని అగ్ని బీజాక్షరాలు. అందుచేత ఆమెలో అనలం అనగా అగ్ని పాలెక్కువ. అందుకే పోతనగారు "పొలతి దావ వహ్ని పురుషుడాజ్య ఘటంబు" అని చెప్పినాడు కనుక స్త్రీని గౌరవించవలసినదే కాని ఆమెతో చనువుగాని, వైరం ఎక్కువగా ఏదీ పనికిరాదు. దానివల్ల జినుడు అనగా ఇంద్రియాలన్ని జయించినవాడైనా సరే వానికి తప్పకుండ ఏదోకీడు కలిగియే తీరుతుంది.

47. కం. **జగమున తలయెత్తినమణి**
సొగసులందు రమణియనగ జూడగలిగినన్
మగువకులేదు కురూపము
మృగలాంఛనుతోడు సుమ్మి వినుమాయార్యా !

తలయెత్తుట = ఉదయించుట - తలలోగల అక్షరం ఎత్తివేయుట.

స్త్రీ అంటే ఆమె ఈలోకంలో ఉదయించిన ఒక రత్నం. అందుచేతనే ఆమెను ప్రభువులకుగల ద్వాదశ రత్నాలలో ఒకటిగా చేర్చినారు. ఉదాహరణకు "రమణి" అనేపదాన్ని చూడండి. దానికి తలలో అనగా మొదటగల అక్షరాన్ని తొలగించండి. అది మణియని రత్నవాచకమై నిలుస్తుంది. కనుక స్త్రీ అనే ఆమె ఈలోకంలో పుట్టిన ఒకరత్నం. ఆ రత్నాన్ని పరీక్షించగలిగిన వారికి రత్నంలో ఎట్లా కురూపత్వం కనిపించదో ఆమెలో కూడ అది కనిపించదు. ఒకవేళ కనిపించినా రత్నాన్ని సానపట్టితే అది తొలగినట్లు ఆమెకుకూడ సంస్కారంతో అది తొలగిపోతుంది.

48. కం. జవరాలి యందునుంగల
వివరాలు వరాలురాలు విరసంబైనన్
తవులుసుమి రాలు చెలువుడు
మివుల రసికుడైన గాక వినుమా యార్యా !

జవరాలు జకారం తొలగితే వరాలు. వరాలులో వకారం తొలగితే రాలు.

జవరాలులో గల వివరాలు - జవరాలు జకారం తొలగితె వరాలు - వరాలులో వకారం తొలగితే రాలు. కనుక జవరాలిలో వరాలు, రాలు రెండు ఉన్నవి. ఆమె చెలువుడు అనుకూడైతె అతని కామెవల్ల వరాలు లభిస్తవి. అట్లాకాక దుష్టుడాయెనా రాలు మాత్రం తగులక తప్పవు.

49. కం. ప్రకృతి త్రయస్వరూపిణి
సకియ యనం బురుషుడెట్టి జనుడైననుదా
రకళత్రము భార్యగ యో
పికచే దగినట్లు నడుచు వినుమా యార్యా !

ప్రకృతి త్రయస్వరూపిణి = మూడు విధాలైన ప్రకృతులు అనగా సాత్విక రాజస తామసాలు మూడుగలది; దార - కళత్రం, భార్య అనే మూడు విధాలైన పుం, నపుంసక, స్త్రీలింగాలు మూడుగలది. ఇది ఇందులోని శబ్దచమత్కారం.

స్త్రీలో మూడు విధాల ప్రకృతులున్నవి. కాబట్టి తన భర్త త్రిగుణాలలో ఎట్టిగుణం కలవాడైనా అతనికి తగినట్లు నడుచుకోగలదు.

దారా అనే శబ్దం పుంలింగం - పురుషుని భయపెట్టునది. భయపడునది అని దీని అర్థం. పురుషుడు అపమార్గం పట్టినపుడామె అతనిని భయపెడుతుంది లేదా అనుకూలుడాయెనా తానే అతనికి భయపడుతుంది.

కళత్రం ఇది నపుంసకలింగశబ్దం. పురుషుని కళంకంనుండి రక్షించేది. అతని కళలు కాపాడేది అని దీనికి అర్థం. ఇల్లాలు మంచిదైనపుడు తనభర్త కేమచ్చరాకుండా కాపాడుతుంది.

భార్య అనగా భరింపబడేది అని అర్థం. సంసారంలో ఆమె పురుషునిచే భరింపబడుతుంది. అతడు పెట్టే కష్టాలన్నిగూడ భరిస్తుంది. ఇట్లా స్త్రీలో మూడు విధాల ప్రకృతి ఉంది.

మామతేయ దీర్ఘతముడు భార్యనట్లా భరించలేదు. ఆమెనే అతనిని భరించింది కాబట్టి చివరకు విసిగి అతనిని కుమారులతో గంగలో త్రోయించింది.

50. కం. వలయునపూర్వ రణంబును
కలియుగమున చెలువలకును కల్యాణమనన్
పలుకుల చేపాసగనిదది
వెలలేని గుణంబులున్న వినుమా యార్యా !

అపూర్వరణం = ఒక క్రొత్తదైన యుద్ధం. అకారం మొదటగల రణం అనగా అరణం. కన్యలకు కల్యాణం అనేవరకు తండ్రి ఒక అపూర్వరణం చేయవలసి ఉంది. అనగా అరణం = అల్లునికిచ్చే కట్నం సంపాదించవలసి ఉంది. దాని కొరకు ఒక పెద్ద యుద్ధం చేసినంతపని అవుతుంది. వధువుకు ఎంతరూప సంపద ఉన్నా, గుణసంపద ఉన్నా, అది మాత్రం అనగా కల్యాణం ఈనాడు మాటలతోనే పొసగదు.

51. కం. మొనగాడైనను సరిథా
త్రిని భర్తగనైన యెడల స్త్రీవద్భావం
బున వంగు పెండ్లిజరిగిన
వెనుక వనితవోలె నరుడు వినుమా యార్యా !

లోకంలో స్త్రీగాని పురుషుడుగాని పెండ్లిజరిగితే వంగుతాడని సామెత. అపుడిక వారికి ఒకరి భయానికి ఒకరు వంగక తప్పదుగదా !

ఈపద్యంలో పురుషుడెందుకు వంగుతాడో చెప్పబడింది. పెండ్లిజరిగితే అతడు భర్త అవుతాడు గదా ! ఋకారాంత శబ్దాలకన్నిటికి తత్సమంలో అత్వం స్త్రీవద్భావం అవుతుంది కాబట్టి భర్తృ అనే శబ్దం భర్త అని స్త్రీలింగంవలె నిలుస్తుంది. కనుక ఎపుడు భర్త అనేవాచకం స్త్రీవద్భావమై నిలిచిందో అపుడేయిక అతనిలోని పురుషాహంకారం అణగి ఆడపిల్లవలె అణకువ వచ్చేస్తుందని అర్థం.

పెండ్లి అయితే అతడు భర్త అనగా భరించేవాడవుతాడు గదా ! తనపైన భార్యఅనే ఒక బరువు పడుతుంది కాబట్టి ఆబరువుకు అతనికిక ఎట్లాగు వంగక తప్పదుమరి.

52. కం. పడతి కుభయ పక్షములను
పుడమి నేడుగడగ నిలిచి పొలుచునెవడునా
తడె పతియటు గాకున్నను
వెడగుసుమీ జగతియందు వినుమా యార్యా !

ఉభయపక్షములు = ఇహపరాలు, రెండువైపులు; ఏడుగడ = ఆధారం.

పడతి అనే పేరులో రెండువైపుల అనగా మొదలు తుది అక్షరాలు కలిపితే పతి అవుతుంది. అదేవిధంగా ఆమెకు ఉభయ పక్షాలు అనగా ఇహపరాలు రెండింటికి రక్షణగా నిలిచిన వాడే భర్త. అట్లా కాకుంటే వాడు అవివేకి క్రిందనే లెక్క.

53. కం. బాలేక బాపులేడిది
యాలోచించినను సత్యమర్ధాంగియనన్
ఆలీల నుండవలదా
మేలిమి గుణ పరిమళమున వినుమా యార్యా !

బాలేక = బా అనగా కస్తూరి. బాలేకుంటే బకారం లేకుంటే - భార్యకు అర్ధాంగి అనిపేరు. కాబట్టి బాపూపేరులో బా అనేపేరు సరిగా సగమై ఆమె అర్ధాంగీత్వం సార్ధకమయింది.

గొప్పవాడైన ప్రతిపురుషుని వెనుక ఒకస్త్రీ ఉంటుందని పాశ్చాత్యుల విశ్వాసం. ఇది మన గాంధీగారి పట్ల గూడ నిజమే. కస్తూరిబా వంటి ఇల్లాలు లేకుంటే ఆయన అంత గొప్పవాడయ్యేవాడు కాదు.

గాంధీగారి పేరు బాపు. ఈ పేరులో బా అనేది సరిగా సగం. ఆ అక్షరం లేకుంటే బాపు అనేపేరే ఉండదు గదా ! ఇది ఇందులోని అక్షర చమత్కారం. కనుక నిజంగా ఇల్లాలంటే అట్లా ఉండవలె.

54. కం. చెలికారమెఱుగ నప్పుడు
చెలికారమెగాక తీపి చెలగునె యిలలో
చెలువల రాజునకైనను
కలువల రాజునకునైన గనుమా యార్యా !

చెలికారము = స్నేహము, చెలి; కారము = కటువు. ఇల్లాలి పట్ల స్నేహమనేది లేకుంటే పురుషునికి ఆమెయందలి మాధుర్యం తెలియదు. అపుడామె అతనికి కారంకారంగానే ఉంటుంది.

55. కం. వగలాడి పొందుగోరిన
వగయొక్కటి లాడి యొకటి వగకాడైనన్
వగచే కాడుంబడి తా
వెగడొందును వానివలన వినుమాయార్యా !

వగలాడి = శృంగార చేష్టలు గల స్త్రీ, వగ = దుఃఖం, లాడి = వ్రణం, కాడు = అరణ్యం - శ్మశానం.

పురుషులు విలాస చేష్టలు గల స్త్రీలవలలో తగులుకుంటే చివరకు దుఃఖాన్ని అనుభవిస్తారు. సుమతి భర్త కౌశికుని వలె వ్రణాలపాలుగూడ అవుతారు. ఆలాగే స్త్రీలు గూడ అటువంటి వానివలలో తగులుకున్నపుడు చివరకు దుఃఖాలపాలై కాడువడిపోతారు. కాబట్టి రూపం, శృంగారచేష్టలు అనేరెండు గూడ మనిషికి ఎంత అందమో అంత ప్రమాదకరమైనవి గూడ, అందువలన వానిని వీధిలో ప్రదర్శించుకుని ఎవరైనా దుఃఖాలపాలు గారాదు.

56. కం. కాంతకును వారకాంతకు
సంతతమును గలదు వార జనుడిది యెరుగన్

చింతవలన దిహపరములు
వింతగ తన చెంతనుండు వినుమా యార్యా !

కాంత = ఇల్లాలు, వారకాంత = వేశ్య, వార = భేదం. కాంత, వారకాంత అన్నపుడు వారిద్దరిలో వార అనగా భేదం స్పష్టంగా మొదటనే కనిపిస్తుంది కనుక ఎవ్వరైనా వారకాంతల జోలికి పోరాదు. అపుడే వారికి ఇహపరాలు రెండు దక్కుతవి.

57. కం. జాగయన యసాధువురా
భోగములకు చెలిమిజేయ బూనిన యెడలన్
ఆగమగునెవ్వడైనను
వేగన్నులవాని తోడు వినుమా యార్యా !

జాగ = జారిణి, ధూర్తురాలు; అసాధువురా = మంచిది గాదురా - అసాదువురా అనగా ఆపదంలోని రేఫం బండిరా అని అర్థం.

జాగలు = అనగా జారస్త్రీలు, అసాధువులు అనగా వారు సాధారణంగా దూర్తురాండ్రై ఉంటారు కాబట్టి ఏదో భోగం కొఱకని వారిచెలిమి ఎవరికైనను తగదు. జాగ అన్నపుడు వారిగుణానికి తగినట్లు ఈపదంలోని రేఫం సాధువుగాక పోవటం గమనార్హం.

58. కం. వెలయా ల్వాదులకును బా
హుళకమునను సంధిలేమి యుండుటకతనన్
వెలయెంతబోసినను యా
వెలదిసంతి గుదురబోదు (సుద్ది) వినుమా యార్యా !

వెలయాలు = విటకత్తె - వేశ్య; బాహుళకము = అధికము, తఱుచు.

వెల+ఆలు అనేపదం వెలాలు అని సంధి జరుగవలసి యుండగా "అత్తునకు సంధి బహుళముగానగు". బాల-సం.-4. అనే సూత్రం క్రింద.

"వెలయాల్వాదుల సంధిలేమి బాహుళకము చేతనేయని ఎఱుంగనది" అని సూరి వివరణంచేత వెలయాలు అని పదం విసంధిగానే నిలుస్తుంది. దానికి కారణం పైసూత్రంలోని బహుళమనే కార్యం.

అదేవిధంగా వెలయాలికి గూడ జారపురుషులెందరితోనో సంబంధ ముంటుంది. ఆమెకెంతోమంది ప్రియులుంటారు కాబట్టి ఏ ఒక్కని చేతగూడ ఆమెకు శాశ్వతమైన సంధిజరగదు.

59. కం. రసభంగముగూడదు సా
రసలోచనలందు చింతగ్రాలిన యెడలన్
కుసుమాంగుల గుణజాలము
బిసతంతుల రీతిద్రెవ్వు వినుమా యార్యా !

రసభంగం = శృంగారసమయంలో దానికి భంగం కలగటం. రసం అనే పదానికి భంగం కలగటం అనగా అది తొలగిపోవటం.

సారసలోచనలు = తామరరేకులవంటి కన్నులుగలవారు. ఈపదంలో రసశబ్దం తొలగించినపుడది సాలోచనలు అవుతుంది. సాలోచనలు అనగా వారు ఎందుకిట్లా జరిగెనా అని ఆలోచనలో పడినవారవుతారు. స్త్రీలయొక్క హృదయం మిక్కిలి కోమలం. వారిగుణాలు తామరనూలువంటివి. వానికే మాత్రం హాని కలిగిన అవి వెంటనే పుటుక్కుమని వారు రకరకాలైన ఆలోచనలలో పడతారు. కాబట్టి స్త్రీలదగ్గర ఎపుడేగాని రసభంగం జరుగనీయరాదు.

60. కం. ప్రేమించగుణము గల పని
కామించుట గుణములేని కర్మము జనుడీ
నేమంబు నెరిగి నడిచిన
వేమడుగుల సుఖమునబ్బు వినుమా యార్యా !

గుణముగలపని = సద్గుణంతో కూడినపని, గుణసంధి గల కార్యం.

ప్రేమ అనే పదం ప్రీఙ్అనే ధాతువుతో ఏర్పడింది. ఇందులో సంస్కృత వ్యాకరణ ప్రకారం గుణసంధి ఉంది. అందువల్ల ప్రేమించటం గుణంగలపని అనబడుతుంది. ప్రేమ హృదయ సంబంధి - కామం దేహసంబంధి. కనుక యువతీయువకులు ప్రేమించుకోవటం తగునుకాని దైహికమైన కామానికి వశపడి పోగూడదు. పరస్పరం ప్రేమించుకున్నపుడే వారు సుఖం చూరగొంటారు.

61. కం. వలపుననుగలదు వలయా
వల దగిలిన తప్పుకొనుట వశముగాదు యీ

కలియుగమున నెవ్వరికిని
కలిపురుషునకైనగాని కనుమా యార్యా !

వలపు- అనే పదంలో వల అనే పదం స్పష్టంగా కనిపిస్తూనే ఉందికాబట్టి స్త్రీపురుషులలో ఎవరైనా సరే ఆవలలో పడితే తప్పుకోవటం కష్టం. ఆవలలోపడక కలిపురుషునికైనా తప్పలేదనటానికి అతడు దమయంతి స్వయంవరానికి వెళ్లటమే ఒకసాక్ష్యం.

62. కం. వ్యతిరేకము సతియనపతి
పతియన సతియైన నొకరి బాసిన యొకరున్
వెతల వియోగము గుడుతురు
మృతిపర్యంతంబునైన వినుమా యార్యా !

సతి పతి యనే పదాలు రెండు వ్యతిరేక ద్వంద్వం. అయినా వారు ఒకరినొకరెడబాసినపుడు మరణపర్యంతం వరకు ఆ వియోగబాధ అనుభవిస్తూనే ఉంటారు. ఇదొక విచిత్రం. ఇది ఆ వలపులోని వల మహాత్మ్యం అనవలె.

63. కం. తలజెడినను పూబోడికి
విలువేదిక జగతియందు విభుడుగతింపన్
హరిహరి బ్రతుకే కష్టము
కలకంఠికి జగతియందు గనుమా యార్యా !

తలజెడుట = వైధవ్యం ప్రాప్తించుట, తలలో ఉండె అక్షరం చెడిపోవుట. పూబోడి = పూవువంటి పోడిమి గలది అనగా కుసుమకోమలి అని అర్థం. స్త్రీఎంతటి సుకుమారురాలైనప్పటికి వైధవ్యం కలిగితే పాపం. ఆమె బ్రతుకు పూబోడి అన్న పదంలో తలచెడటం అనగా ప్రథమాక్షరం తొలగినపుడు అంతచక్కని సమాసం బోడి అని ఎట్లా హీనార్థంగా మిగిలిందో అట్లాగే ఆ స్త్రీగూడ సౌందర్యహీనురాలై దయనీయంగా మిగిలిపోతుంది. కాని ఈనాటి స్థితివేరు.

ఈ శతకాన్ని, ఒకపుడు ఒకసోదరి సమీక్షిస్తూ "ఈ పద్యాన్నీనాడు ఎందరామోదిస్తారో" అని సందేహం వెలిబుచ్చింది. ఆమె సందేహం యిపుడు నిజమే కనుక ఇది కాలదోషం పట్టిన కవితల్లో ఒకటి అనవలె. ఇక్కడ నేను మీకో విషయం చెప్పవలె.

నేనీశతకాన్ని క్రీ.శ. 1978లో ప్రచురించినాను కాని దీన్ని అంతకు చాలా మొదలే 1968 ప్రాంతంలోనే వ్రాసినాను. అప్పటికింకా సంఘంలో వితంతు వివాహాలు గాని, ఈనాటి స్త్రీవాదంగాని లేవు. ఆనాడీపద్యాలు నా మిత్రులు చాలామంది తమాషాకు కంఠతః చేసినారు. వారిలో మిత్రుడు శ్రీ చౌడూరి గోపాలరావు గారు ముఖ్యులు.

నేను నాగర్‌కర్నూలుకు ఉద్యోగానికి వచ్చేనాటికి హైదరాబాదునుండి ఇక్కడికిగాని ఇక్కడి నుండి అక్కడికిగాని డైరెక్టు బస్సులు లేవు. జడ్చర్లకు వెళ్ళి అక్కడినుండి ట్రైయిన్‌లో గాని లేదా జిల్లాకు వెళ్ళి అక్కడినుండి బస్‌లోగాని వెళ్లవలసి ఉండేది. ఒకపుడు నేను జడ్చర్లలో లోకల్ ట్రైనెక్కినాను. అది గాంధీక్లాసు కాబట్టి అందులో అప్పటికే సర్వసమానత్వంగా ఆడ, మగా అందరు కలిసే ఉన్నారు. డోర్ దగ్గర ఎవరో ఒక తల్లి కూతుళ్లున్నారు. కూతురు కాబోలు ఒక చిన్న పీపావంటి డబ్బాలో నూనె తీసికొని సీటుక్రిందికి ఉంచింది. ట్రెయిన్ షాద్‌నగర్ చేరగానే పాపం ఎవరో ఒక బ్రాహ్మణ వితంతువు ఒకమూటతో ఎక్కింది. ఎక్కేతొందరలో ఆమె మూటను మొదట లోపలికి త్రోయగా అది ఆసీటుకింది డబ్బాను తగిలి అది క్రిందపడటం, కాసింత నూనె వలకటం, వెంటనే కూతురు దాన్ని సరిగా పెట్టుకోవటం జరిగిపోయింది. కాని తల్లిమాత్రం ఆనేరాన్ని క్షమించలేదు. చాలా అసహనంగా ఆమెపైకిలేచి పదేపదే "ఈబోడబాపనిది మానూనె అంతా వలకపోసె" అని చాలాసేపు రంతుచేసింది.

పాపం ఆమె ఏమీ అనలేదు. ఏదో ఒకమాట "నీవు దారిలో ఎందుకు పెట్టినావు?" అని మాత్రం అన్నది. దానితో "ఊరుకోవె బోడముండ అక్కడ కాకుంటె మరెక్కడ పెట్టమన్నావు" అని ఆమెను నోరెత్తనీయలేదు. అట్లా ఆమె పదేపదే ఆమె బోడితనాన్ని, దెప్పుతుండగా ఆమె "ఆడజన్మెత్తినపుడు ఎవరికైనా అది తప్పదే" అని అంటు తలపైకి ముసుగు సరిగా సవరించుకుని ముఖం చిన్నబుచ్చుకున్నది. ఈ దృశ్యమంతా ప్రక్కనే ఉండి చూస్తున్న, నాకు చాలా బాధనిపించింది. ఇది నాతోపాటెందరో చూచినారు గాని ఆమె నోటిదురుసుతనం చూస్తు కాబోలు ఎవరుకూడ ఆమెను వారించలేకపోయినారు. కనుక ఆనాటి స్ఫూర్తి నాతో ఈపద్యాన్ని వ్రాయించింది.

64. కం. సారంబే కడ నున్నది
నేరని వచనంబుసుమ్మి నిస్సారము సం

సారమను మాట జగమున
మారమణుని తోడు సుమ్మి మహిలో నార్యా !

సారంబే కడ నున్నది = సారం ఎక్కడుంది. చివరకు సారమే ఉంది. సంసారం అనేపదంలో సమ్+సారమ్ అనే రెండు పదాలున్నవి. వానిలో చివరది సారంగాకాబట్టి 'సంసారంలో సారమెక్కడుంది' అనవద్దు. దానిలో చివరకదే ఉంది. అందుచేతనే గృహస్థాశ్రమం ఇహపరాలు రెండింటికి ఆధారంగా ఉంది.

65. కం. అందము పూజ్యము సారము
పొందుగ సంసారమందె పొసగినవి సుమీ
అందువలన సంసారమె
విందుము సుఖమంచు జగతి వినుమాయార్యా !

సంసారమనే పదంలో - సమ్ - అనగా అందం. ఒకవేళ సంలో బిందువే ఉంటె అది పూజ్యం, అనగా గౌరవం. చివరది సారం. అనగా సంసారంలో అందముంది, గౌరవముంది, సారముంది కాబట్టి అందుకే పూర్వులు సంసారంలోనే సుఖముంది అన్నారు.

66. కం. పురము మొదట గావలయును
నరునకు కాపురము జేయ నడిబొడ్డున జే
కురు గ్రామమున్ననందరు
బిరబిరమని చేయగలరు వినుమా యార్యా !

పురము మొదటకావలయును = కాపురం చేసే అందుకు మొదటపురం అనగా అతనికి తగిన ఊరు కావలె. కాపురం అనే పదం నిర్మించే అందుకు పురశబ్దానికి మొదట కా అనేది చేర్చవలె.

గ్రామం అచ్చివచ్చింది అనటానికి తెలుగులో "ఊరు నడిబొడ్డున పడింది" అనే జాతీయం రూఢిలో ఉంది. ఇది గ్రామార్వణాన్ని బట్టి వచ్చింది. గ్రామార్వణ చక్రం నరాకారంగా లిఖింపబడుతుంది. అందులో మూర్ధాదిగా నక్షత్రాలు వ్రాయబడుతవి. వానిలో వ్యక్తి నక్షత్రం నాభిస్థానంలోనికి వచ్చినపుడు అతనికా ఊరు బాగా కలిసివస్తుందని చెప్పబడుతుంది. కాబట్టి ఆవిధంగా ఊరు నడిబొడ్డున పడినపుడు ఎవరైనా కాపురం బాగానే చేయగలరు.

67. కం. పురివికటించిన రిపువగు
టరు దానరు దెరిగి దీని నరుగకయున్నన్
వరలునె యచ్చట సుఖములు
వెలిగాకను జగతియందు వినుమా యార్యా !

వికటించు = వ్యతిరేకమగు, పురి అనేపదం వ్యతిరేకమైనపుడు రిపు అవుతుంది. పురి అనగా గ్రామం, రిపు అనగా శత్రువు.

ఎపుడైనా గ్రామం వ్యతిరేకమైతే అట అతని పాలిట శత్రువే కాబట్టి ఎవరైనా దీన్ని ఎరిగినడుచుకోవలె. లేకుంటే అతని కక్కడ భయం తప్పదు.

68. కం. ఎప్పటి పోకడ నప్పుడు
తెప్పుడు పోలేక యున్ననుండు జనుడు తా
నెప్పటి కడనో కడనో
విప్పనేలదాని గుట్టు వినుమా యార్యా !

ఎప్పటిపోకడ = ఏ కాలమునకేది తగునో ఆనడవడి; పోలేకయున్న = నడవలేకున్న యెడల, - పో అక్షరం లేకున్నయెడల, పోకడలో పో లేకుంటే అది కడ అని అవుతుంది. కడ అనగా చివర అని అర్థం. కాబట్టి మానవుడీ ప్రపంచంలో ఏకాలానికేది తగునో ఆనడవడి అవలంబించలేకుంటే అతడెప్పటికి కడనే అనగా వెనుకబడియే ఉంటాడు.

69. కం. మనసు నపుంసక మైనను
గననెటు స్వర్లోకమందు గలరంభలకై
జననట్టు జూచు దానిని
నణచకున్న, ముక్తిగలుగదనుమా యార్యా !

మనశ్శబ్దం సంస్కృతంలో సకారాంత నపుంసకలింగం. వ్యాకరణవేత్తలు సంస్కృత శబ్దాలలో దాని లింగాన్నాధారం చేసికుని అనేకమైన చమత్కారాలు సృష్టిస్తుంటారు. అందులో ఇదొకటి.

ధర్మార్థ కామ మోక్షాలు అనే నాలుగు పురుషార్థాలు. వీనిలో ధర్మార్థాలు రెండు సంపాదింపదగినవి. అనగా శ్రమవిభాగానికే చెందినవి. కామమోక్షాలు

రెండు అనుభవానికి చెందినవి. వీనిలో మొదటి రెండిటికి తర్వాతి వానికి ఒక క్రమం కనిపిస్తుంది. మానవుడు ధర్మబద్ధంగా కామాన్ని, అర్థంతో మోక్షాన్ని అనుభవించవలె కాని యిపుడు అర్థకామాల్ని రెండిటిని జోడించి అర్థంతో కామాన్ని అనుభవిస్తున్నాడు. ఆపక్షంలో ధర్మంతో మోక్షాన్నైనా అనుభవించవలెగాని ఆరెండిటిని విస్మరిస్తున్నాడు.

సకాములకైతె ఇహసుఖానికి అతనికి స్త్రీయే పరాకాష్టగా ఉందికాబట్టి అతడు పరలోకంలో గూడ దాన్నేకోరి సకాముడై యజ్ఞయాగాదులు చేస్తున్నాడు. మానవుని యొక్క ఈకోరికకంతా మనస్సే మూలం కాబట్టి మనస్సు నపుంసకమైతే అది బ్రతికినంతకాలమే గాదు ఈదేహానంతరంగూడ స్వర్గంలోని రంభాదుల సుఖాన్నే ఎందుకు కోరుతుందని మనిషి సందేహం. ఇదొక శాబ్దిక చిత్రమైన భావన.

మనస్సు నపుంసకమో పుంలింగమో స్త్రీలింగమో ఏదేకానిగాక దాన్ని అణచకుంటే మాత్రం మానవునికి ముక్తిలభించటం కష్టం.

70. కం. ధరయందు ధీ విశేషం
బరయమహాప్రాణమగుట నదిలేకున్నన్
నరుడల్పప్రాణి యగుసుమి
కరపాదతలంబులున్న గనుమా యార్యా !

ధీ = బుద్ధి - అంతఃకరణాలలో మనస్సు తర్వాత చెప్పదగింది బుద్ధియే. దీని పర్యాయమైన ధీ శబ్దం వ్యాకరణ ప్రకారం మహాప్రాణం. కనుక ప్రాణమైన ఈ ధీవిశేషం మనిషిలో లేకుంటే అతడు మనిషియైనా సరే అల్పప్రాణి క్రిందనేలెక్క.

71. కం. తాజడ్డది చిత్తముగన
రాజైన వశీకరింప రాదదిగానన్
యోజనది గెల్చునతడే
గాజాలును పూజితుండు గనుమా యార్యా !

జడ్డది, జెడ్డది = సంకటమైనది - హల్లుతో సంయుక్తమైనది. చిత్తమనే శబ్దంలో తకారం మళ్లీతకారంలోనే సంయుక్తమయింది. కాబట్టి చిత్తంలో తాజడ్డది ఇటువంటి సంయుక్తాన్ని ద్విత్వం అని అంటారు.

మానవులకు కలిగే ఆపదలన్నిటికి మూలం చాలావరకు అతని అంతఃకరణాలే. అందులో చిత్తం మరీ సంకటమయింది. అందువల్ల దాన్ని గెల్చినవాడే ప్రపంచంలో గౌరవింపబడుతాడు.

72. కం. నాదియనెడు భావంబున
నాదినె గలదందు వలన నరులందది పో
బోదును దాత్తకృతిచే
మేదినిపై దిద్దవలయు వినుమాయార్యా !

అనాది = ఆదిలేనిది అనగా చాలాపూర్వానిది. నాది మమ అనే పదం. అది అనాది అనేపదంలోనే ఉంది. నాది అనేది అహంకారానికి చిహ్నం. అది ఒక సహజాతం అనగా పుట్టుకచేతనే వచ్చే లక్షణం కాబట్టి అదివ్యక్తిలో నశించదు. ఒకవేళ అది నశించెనా ఇక ఆ వ్యక్తికి అస్తిత్వముండదు. కాబట్టి దాన్ని నశింపచేసే ప్రయత్నంకంటే ఉదాత్తీకరింప చేయటం మంచిది.

73. కం. తలయుండినచో తలపులు
తలలేకున్నపుడు పులు విధాత విధించెన్
ఇల యందులన ప్రాణులకున్
కలగాదిది నిక్కువమ్ము గనుమా యార్యా !

తలపులు = ఆలోచనలు, ఈపదంలో తలలేకుంటే మిగిలేది పులు, పులు అనగా గడ్డి.

తలయుండిన = తల బుద్ధికి ఆలోచనకు చిహ్నం కాబట్టి లోకంలో తల ఉన్న జీవులు, అదిలేని జీవులు అని రెండు రకాలప్రాణులున్నవి. వానిలో మనిషి తలగలజీవి.

సృష్టికర్త తల ఉన్న జీవులకు తలపులు అనగా ఆలోచనలు, అదిలేని జీవులకు అనగా పశువులకు పులు అనగా గడ్డిని ఆహారంగా విధించినాడు. అనగా పశువులన్ని ఆహారంపై బ్రతుకగా మనిషి ఆహారంకంటే ఆలోచనలపైనే ఎక్కువగా బ్రతుకుతాడని అర్థం.

74. కం. దయలేని హృదమయనగ హృ
దయమే అది జగతియందు దానికి నహి ని
శ్చయముగ నాస్తిత్వంబే
మెయినయినను జగతియందు వినుమా యార్యా !

దయలేని హృదయము = దయ అనే పదంలేని హృదయం. హృదయము అనే పదంలో దయ అనే రెండక్షరాలున్నవి కనుక దయ లేని హృదయం, హృదయం గాదు. అటువంటి హృదయానికి లౌకికపరంగాగూడ ఆస్తిత్వం ఉండదు. దయతొలగిస్తే అది హృ ము అని మిగిలి ఏఅర్థం లేకుండా పోతుంది.

75. కం. కనమానవత్వమందున
దనరు నవత్వంబు జన్మత: గావున భూ
మిని నెప్పుడు నవమార్గము
నను నరుగన్ వలయు నరుడు కనుమా యార్యా !

మానవత్వం = మనిషితనం, నవత్వం = క్రొత్తదనం. మానవత్వం అనేపదంలోనే సహజంగా నవత్వముంది కాబట్టి మానవుడెప్పుడు నూతనాన్వేషిగా నుండవలె. అట్లా నూతనాన్వేషణలోనే అతని ప్రగతి ఉంది.

76. కం. కలదువికారము వికృతిని
తలపవలదు దానిబూన దైవంబైనన్
ఇలలోన దయ్యమగుసుమి
కళయు గిళయు వీడి జగతి కనుమా యార్యా !

వికారము = వికృతరూపం. వికృతి = వికార రూపం. వికృతి వ్యాకరణంలో ఒక శబ్దభేదం. ప్రకృతి చెడినపుడది ఏర్పడుతుంది.

మానవుడెపుడు గూడ వికృతిని పొందవలెనని దలచగూడదు. ఉదాహరణకు దైవపదాన్నే చూడండి. దైవం యొక్క వికృతి దయ్య మవుతుంది. కనుక లోకంలో దైవంపై ఉన్న పూజ్యభావం దయ్యంపై లేదుగదా ! అందువల్ల వికృతిని పొందరాదని అర్థం.

77. కం. దొరతన మపూర్వతనము
అరయంగా దానికొలకు నాసక్తిమెయిన్
జరుపక యత్నము దొరుకునె
వెరవెరుగని మాటలేల వినుమా యార్యా !

దొరతనం = పెద్దతనం, అధికారితనం; రతనం = రత్నం. దొరతనం అనే పదంలో మానవత్వంలో నవత్వం వలెనే రతనం అనే పదం ఉంది కాబట్టి "ఎవరికైనా దొరతనం లభించిందంటే అతనికది ఒకరత్నం దొరికినట్లే" కనుక ఆ రత్నం ఎంతో ప్రయత్నం చేతనేగాని ఊరక ఎవరికి గూడ లభించదు.

78. కం. నడవడియందున సత్యము
పడమి సమస్తమ్ము గలది బూనిన దానిన్
ఒడుదుడుకులెల్ల దొలగును
మృదునితోడు జగతియందు వినుమా యార్యా !

సత్యము = నిజము; సమస్తమ్ముగలది = అన్ని లక్షణాలున్నది. సకారం తలలో గలది. సత్యానికి సకారం తలలో ఉంది గాబట్టి అది సమస్తం గలది ఔతుంది. "సత్యాన్ని ఆశ్రయిస్తే మనం అన్ని ధర్మాలాచరించినట్టే" అని గాంధీగారి మతం. కనుకదాన్ని ఆశ్రయించిన వానికి అన్ని కష్టాలు తొలగుతవి.

79. కం. సమ్మతమున మతమున్నది
యమ్మతమున తముగలార లార్యులుగావన్
సమ్మతమె శ్రేష్టమగుమత
మిమ్మహి జేజమ్మలకును వినుమా యార్యా !

సమ్మతము = అందరి అంగీకారమైనది; మతం = అభిప్రాయము; తము = తాము.

ఈమూడు పదాలు కదంబపుష్ప న్యాయంగా ఒక దానిలో ఒకటి ఉన్నవి. లోకంలో మతం అనేది అందరి సమ్మతం అనగా యిష్టంపైననే ఆధారపడి ఉంది కనుక గొప్పవారంతా ఆవిధంగా అందరికిష్టమైన మతంలోనే ఉంటారుకాబట్టి ప్రపంచంలోని మతాలన్నిటిలో సమ్మతమె అనగా దేనికి ప్రజల అంగీకారం ఎక్కువగా ఉంటుందో అదేశ్రేష్టం.

80. కం. ఇల నమ్రతలో రావడి
గలదైనను దానితలను గలదు గురుత్వం
బిల నీసత్యం బెరిగియు
మెలగవలయు జనుడునెపుడు వినుమా యార్యా !

నమ్రత = అణకువ; రావడి = ఉపద్రవము, రావత్తు; గురుత్వం = గొప్పదనం, గురువయ్యే లక్షణం. నమ్రత అనే పదంలో తలపై అనగా మొదటి అక్షరం సంయుక్తానికి పూర్వంగాబట్టి గురుత్వముంది. అట్లాగే మానవుడు అణకువతో ఉండటంలో ఉపద్రవం అనగా కొంత కష్టం ఉన్నా, గొప్పదనం మాత్రం వానికే ఉంటుంది. కాబట్టి వ్యక్తి ఎపుడైనా నమ్రతగనే ఉండవలె.

81. కం. తలబిరుసు గలదు కలిమిని
ఇలనస్థిరమదియు లేమియే తిరము సుమీ
కలియుగమందున నిజమిది
విలువెన్నగనేలదాని వినుమా యార్యా !

తలబిరుసు = తలపొగరు (బిరుసు=పరుషం). తలలో అనగా మొదట పరుషాక్షరం ఉండటం. అస్థిరం = అశాశ్వతం; తిరం = శాశ్వతం.

వ్యాకరణ ప్రకారం కచటతపలు పరుషాలు, గజడదబలు సరళాలు, ఇతరాక్షరాలు స్థిరాలు అనగా మారనివి అని అర్థం. పరుషసరళాలు పరస్పరం మారుతుంటవి కాబట్టి అవిస్థిరంగాదు. అట్లాగే మానవునికి కలిమిగూడ స్థిరంఅనగా శాశ్వతం గాదు. పైగా అది కలవానికి కలిమికి తగినట్లు తలబిరుసుతనం గూడ ఉంటుంది. లేమి అట్లాగాదు. ఈపదంలో ఉండే రెండక్షరాలు స్థిరాలే కాబట్టి లేమిగూడ మనిషికి అట్లాగే స్థిరంగా ఉంటుంది. సంపద ఎపుడో ఒకసారి వచ్చిమళ్ళి వెళ్ళిపోతుంది. కాబట్టి కలిమిపై ఎవరూ గర్వపడరాదు.

82. కం. ఎంతగనాలోచించిన
చింతను శూన్యంబుదప్ప శ్రీగన్పడదా
వంతయుగావున చింతా
కంతైనను చింతవలదు వినుమా యార్యా !

శూన్యం = వట్టిది; సున్నా. చింత అనే పదంలో నడుమ సున్న ఉందికనుక చింతలోగూడ అంతే. మానవుడెంత సేపు చింతించినా దానిలో శూన్యమేగాని ఫలితం ఉండదు. నిరంతరం చింతించే బదులు మానవుడు తొందరగా ఏదో ఒకనిర్ణయానికి రావలె. అపుడే అతని జీవితం సవ్యంగా నడుస్తుంది.

83. కం. మంచిచెడులు రెండు విచా
రించియు పూజ్యంబుగోచరించెడు దానిన్
యెంచుకొనిన హితమగునిది
మించినట్టి హితము లేదు వినుమాయార్యా !

పూజ్యం = గౌరవం, బిందువు అనగా సున్నా.

మనిషి మంచి చెడు అనేరెండు పదాలను గురించి ఆలోచించవలె. దానిలో పూజ్యం (సున్నా) దేనిలో ఉందో దాన్నే ఎన్నుకోవలె. అది మంచిలోనే ఉంది కాబట్టి దాన్నే ఎన్నుకోవలెనని హితవు.

84. కం. కలిమికి మొదటను నా
కలి కవసానంబునందు కలియం శంబున్
గలదుగాన నీరెండును
మెలిబెట్టును నరుని భువిని వినుమా యార్యా !

కలిమి = సంపద; ఆకలి = క్షుద్బాధ; కలి = జగతి కలియంశ, కలిపురుషుని యొక్క విషయం. ఈ రెండుపదాలలో కలిమి అన్నపుడు మొదట ఆకలి అన్నపుడు చివర "కలి" అనేపదం ఉంది కనుక అవి కలిపురుషుని యొక్క ప్రభావం తప్పక చూపుతవి.

ప్రపంచాన్ని సంపద - ఆకలి ఈరెండే సుడిలో పడవేస్తున్నవి. లోకంలో జరిగే విప్లవాలు, యుద్ధాలు, కొట్లాటలు అన్ని ఈరెండిటి చేతనే జరుగుతున్నవి. కాబట్టి వాని విషయంలో మనిషి జాగ్రత్తగా ఉండవలె.

85. కం. కలకొనసాగిన యెడలను
కలగాదది శిల్పమగును కానపుడు భువిన్
కలలెల్ల కల్లలగు సుమి
కలియుగమున వగవనేల వినుమా యార్యా !

కల = స్వప్నం, ఊహా లోకం; కలా = శిల్పం; కల్ల = అబద్ధం; కొనసాగు = యధావిధిగా జరుగు, చివరకు దీర్ఘమగు.

కల అనేపదం చివరకు దీర్ఘమైనపుడు కలా అని సంస్కృతపదమవుతుంది. దానికపుడు శిల్పం అని అర్థం అనగా తన ఊహలన్ని కలిసివస్తున్నపుడు జీవితం ఒక శిల్పదర్శనంవలె ఆనందాన్ని నింపుతుంటుంది. అట్లా కానపుడు మాత్రం అతనికలలు కల్ల అంటె అబద్ధమే అయిపోతవి.

86. కం. ముదమునసే దెసచూచిన
ముదమే కనిపించులోకమునసైనను రా
దదినమ్మ సున్నయగుసుమ్మి
పృథివిని తుద చెదరనేని వినుమా యార్యా !

ముదము = సంతోషం; తుదచెదిరెనేని = చివరకు చెడిపోయినపుడు, చివర చెడినపుడు; సున్నయగు = మిగుల కుండపోవు, బిందువగు.

ముదము అనేపదం అనులోమ విలోమం కాబట్టి అది ఎటునుంచి చదివినా ఒకటేగాని చివరి మువర్ణకం చెడినపుడు మాత్రం అదిబిందువై దాని అనులోమ విలోమత్వం సున్న అవుతుంది. ఆలాగే మనిషికి సంపదలకాలంలో ఎటుచూసినా తనకుఅంతా సంతోషంగానే ఉన్నట్లు కనిపిస్తుంది. కాని అది నమ్మదగనిది. ఎపుడు చెదిరిపోతుందో తెలియదు. చెదిరిన నాడు మాత్రం ఏమిమిగులకుండా చివరకు సున్నా అయిపోతుంది.

87. కం. అనుకొనవలెగాని నరుం
డనుకొనగన సంభవంబునగు సంభవమే
ననియందురు విజ్ఞులు సుమి
వినవేడుకమైన మాట పృథివిని యార్యా !

అనుకొనవలె = గట్టిగా సంకల్పించుకొనవలె. అకారమును తీసికొనవలె అనగా తొలగించవలె.

అసంభవము = అసాధ్యం. అసంభవం అనేపదంలో అకారాన్ని తొలగించినపుడు అదిసంభవం అనగా సాధ్యం అనే అర్థంలో నిలుస్తుంది.

ప్రపంచంలో అసంభవమనేది ఏది లేదని నెపోలియన్‌మాట. కాబట్టి సమస్త కార్యాలు మానవుని యొక్క స్థిరసంకల్పంపైనే ఆధారపడి ఉన్నవి.

88. కం. తలదాకక కామితములు
ఇలయందున మితములగునె ఇంద్రునకైనన్
అలపాలుగాదునిక్కము
కలియుగమున జనములకును గనుమా యార్యా !

తలదాకు = అనుభవమగు - తలలోగల అక్షరాన్ని తొలగించు.

కామితం = కోరిక తలలోగల అక్షరం తొలగించినపుడు, మితం = ఒక పరిమితిగలది. తలలో ఉండే అక్షరం తొలగించినపుడు కామితం ఎట్లామితం అవుతుందో అదేవిధంగా మానవునికి అనుభవం అయినపుడుగూడ అతని గొంతెమ్మ కోరికలన్ని ఒకమితమై నిలిచిపోతవి.

89. కం. త్యాగము నిశ్చయముగ నొక
యాగంబీ జగతియం దనాదిగ గానన్
త్యాగము గల్గిన జనులకు
కాగలవు శుభంబులెల్ల కర్మల నార్యా !

త్యాగం అనేది లోకంలో నిజంగా ఒక యాగమే అనగా యజ్ఞమే. యజ్ఞంలో త్యాగమే అనగా వితరణమే ప్రధానం. వితరణలేని యజ్ఞం అతడెంత విధిరహితంగా చేసినా అది యజ్ఞఫలాన్నీయదు.

త్యాగం అనే పదంలో తకారం పొల్లు తొలగితే అపుడు నిలిచేది యాగమేకాబట్టి మానవుని త్యాగగుణమే అతనికి యాగఫలాన్ని సమకూరుస్తుంది.

90. కం. ఆశా దీర్ఘము హ్రస్వము
భాసిల్లును దృష్టియెట్లు బరగెడునుసుమీ
దోషములు లేక నుండగ
వేషంబుల లోకమిద్ది వినుమా యార్యా !

ఆశ = కోరిక. ఇది సంస్కృతంలో దీర్ఘాంతపదం.

దీర్ఘం = గొప్పది, పొడవైనది; దృష్టి = చూపు ఇది హ్రస్వం పదం; హ్రస్వం = పొట్టిది, చిన్నది.

సంస్కృత భాషలో ఆశాశబ్దం దీర్ఘాంతం, దృష్టిశబ్దం హ్రస్వాంతం. ఈశబ్దాలకు తగినట్లు బ్రహ్మదేవుడు మనిషికి ఆశను చాలా దీర్ఘంగాను, దృష్టిచాలా చిన్నగాను చేసినాడు. ఇదొక విచిత్రమైన పరిస్థితి కాబట్టి ఈ స్థితిలో లోకంలో ఆశాపరుడు దోషరహితుడుగా ఉండటం కష్టం. అందుచేత మనిషి ఆశకుపోక ఒకకాడికి నిలిచి త్యాగగుణం కలిగి ఉండవలె.

91. కం. తారున్మారుట యే సుమి
ధారుణిలో తారుమారు తార్మారైనన్
వారెల్లమారుతారు సు
మీరయమున నెవ్వరైన వినుమా యార్యా !

తారు = తమరు; తారుమారు = వ్యతిరేకమగు, తాముమారు.

తారుమారు అనేపదం వ్యతిరేకమైనపుడు మారుతారు అని అవుతుంది కాబట్టి పరిస్థితి తారుమారయింది అంటే అక్కడ ఉన్నవారంతా మారినారని అర్థం.

92. కం. తుదమొదలు నాస్తినటనకు
నది నిజమనుటెట్లు నటుడు హరుడైన సరే
ఇది యెరుగక నదినమ్మిన
పిదప చింత నొందగలడు పృథివిని యార్యా !

తుదమొదలు = కొనయందు మొదటియందు; నటన = నటించుట అనగా పైకి కనిపింప చేయుట - అసత్యం; నాస్తి = ఏమి ఉండదు; న+అస్తి = నాస్తి = నకారం కలదు.

నటన అనే పదానికి రెండువైపులా నకారమే ఉంది. కాబట్టి నటనకు తుద మొదలు నాస్తి అయింది. నటనకు తుదమొదలంటు ఉండదు కాబట్టి నటించే వారిని ఎప్పుడూ నమ్మరాదు. నమ్మినవాడు చింతలపాలు గాక తప్పదు.

93. కం. సుడిగల దదృష్టమురా
వడిగాదు జగానగాన ప్రజకదిగలుగన్
ఇడుములును కుడుములగు సుమి
మిడిమేలము గాదు జగతి వినుమా యార్యా !

సుడి = రోమా వర్తము. శరీరంపై ఉండే ఈ రొమావర్తం వ్యక్తి యొక్క మంచి చెడ్డలు రెండు తెలిపినా ఎక్కువగా యిది అదృష్టచిహ్నంగానే ఈరూఢిలో ఉంది.

సుడి అనగా ఋకార చిహ్నం. అదృష్టం = భాగ్యం. అదృష్టం అనే పదంలో ఉండేది సుడిగాని రావడిగాదు. అంటే అదృష్టాన్ని అద్రుష్టం అని వ్రాయరాదు. అదృష్ట శబ్దంలో ఎట్లా సుడి ఉందో అదృష్టవంతునికి గూడ ఆ ఐశ్వర్యానికి ఎక్కడనో సుడి ఉందనే అర్థం. అందువల్లనే అతనికి కలిగే కష్టాలుగూడ సుఖంగానే మారుతుంటవి.

94. కం. నగవునగలదు సుమీ నగ
తగ దానిని దాల్చునెవడు తత్పరమతియై
జగము వశీకరణంబగు
వెగడుతీరు దానివలన వినుమా యార్యా !

నగవు = మందహాసము; నగ = భూషణం, ఆభరణం. నగవు అనేపదంలో నగ అనే పదం ఉంది. అదేవిధంగా ముఖంపై ఎపుడు నగవు ఉంటే అది ఆవ్యక్తికి ఒక ఆభరణమే అనవలె. ఆభరణాలు ధరించినపుడు వ్యక్తి లోకాన్ని ఎట్లా వశీకరించుకోగలడో అట్లాగే ఎల్లపుడు చిరునగవుతో ఉండేవాడు గూడ అట్లాగే లోకాన్ని వశీకరించుకోగలడు.

95. కం. ఆకొనినపుడాహారము
లోకమ్మున హారమగును ఋషియైన సుమీ
ఆకలి లోభం బట్టిది
యాకౌశికుడెరుగు దానినవనిని యార్యా !

ఆకొను = ఆకలిగొను, ఆకారాన్నితీయు; ఆహారం = తినదగిన వస్తువు, తగినవస్తువు. ఆహారంలో "ఆ" కారం తీసినపుడది హారం అనగా అది దోచుకోదగిన వస్తువు అని అవుతుంది. మహాభారతంగూడ తిండివరకు దోచుకున్న వస్తువు దొంగతనం కాదనే చెబుతుంది. విశ్వామిత్రుడొక యుగ సంధిలో ఒక హరిజనవాడలో కుక్క మాంసాన్ని దొంగిలించినాడు. కనుక ఆకలి బాధ ఎట్టిదో అతనికి తెలుసు.

96. కం. కాగలవేళను గడయే
కాగడయగు జగతియందు కాలేనపుడున్
బాగుగ కావలియగుసుమి
కాగలయది యెట్లు దప్పు కలిలోనార్యా !

కాగలవేళ = కలిసివచ్చే సమయంలో, కా అక్షరం ఉన్నపుడు; గడ = సామాన్యమైన వెదురుకఱ్ఱ; కాగడ = దివిటి; కావలి = రక్షణ; వలి = చలి.

అదృష్టం కలిసివచ్చినపుడు మనిషికి తనచేతిలోని వట్టికఱ్ఱగూడ దివిటియై దారి చూపుతుంది. అదికానపుడు తనకుగల కావలి గూడ చలియై బాధిస్తుంది. ఇది లోకం తీరు.

97. కం. కాబోవునపుడు కావర
మేబొల్చు వరంబునగుచు మేదిని యటులే
రాబోవునెడల రావడి
కాబోవును యిది నిజంబు కాశ్యపి నార్యా !

కాబోవునపుడు = అయేఅపుడు అనగా మంచి జరుగనున్నపుడు కకారం పోయినపుడు; వరము = శ్రేష్టము.

కావరంలో కకారం తొలగితే వరం అవుతుంది. రావడి = ఆపద; రావడిలో రా తొలగితే అది వడి అవుతుంది. అనగా తనకు మంచి జరిగేకాలం ఉన్నపుడు అతని కావరం గూడ అతనికి వరంగానే పరిణమిస్తుంది. అట్లాగే రాబోయే కాలంలో రావడి అనగా ఆపదగూడ వేగంగానే వస్తుంది.

98. కం. ఉపయుక్తమైన చర్యలె
ఉపచర్యలగుం జగాన నుత్తగవేరే
ఉపచర్యలేల పైపై
విపరీతంబగును గాక వినుమా యార్యా !

ఉపయుక్తమైన = పనికివచ్చిన, ఉప అనేపదంతో కూడిన; చర్య=పని.

ఇతరులకు సేవచేసే అపుడు వారికి ఉపయోగపడేపని చేస్తే చాలు. అదేవారికి ఉపచర్య అవుతుంది. కాని వేరే పైపై పనులెన్ని చేసినా అది ఉపచర్యగాదు.

చర్య అనేపదం ఉప అనేదానితో కూడినపుడే అది ఉపచర్య అవుతుందనేది ఇందులోని శబ్దచమత్కారం.

99. కం. దంతికి మించినది వ
దంతిగాన దాని గబ్బితనమునకు నుమా
వంతుడై మెలగకుండిన
వింతగాదు చింతలొందు వినుమా యార్యా !

దంతి = ఏనుగు; వదంతి = పుకారు.

దంతికి రెండక్షరాలు, వదంతికి మూడక్షరాలు కాబట్టి వదంతి - దంతికంటే మించింది. అందువల్ల దాన్ని మావటి ఏనుగు గర్వాన్ని అణచినట్లు అణచకుంటే తర్వాత చింతించవలసి వస్తుంది.

100. కం. ఆకార భేదమేయటు
గాక శస్త్ర శాస్త్రములకు గలదే భేదం
బీకలియుగమున రెండును
కాకగూర్ప మాన్పగలవు గద సుమి యార్యా !

ఆకార భేదం = రూపంలో భేదం, "ఆ"కారం యొక్క భేదం

శస్త్ర - శాస్త్ర = ఈరెండు పదాలకు ఆకారం అనగా దీర్ఘం మాత్రమే భేదం. ఈ రెండు గూడ ఈనాడు ఉపయోగాన్ని బట్టి మానవులకు మేలు కీడు రెండిటిని చేయగలుగుతున్నవి.

101. కం. గంగకు నిదరినద్దరి
నింగలుగునె భేదమొకటి నిజముగనెచ్చో
టంగలుగు పవిత్రతయా
వింగడ మటువలయునేల వినుమా యార్యా !

ఈదరి - ఆదరి = ఈవల - ఆవల, గంగపదం అనులోమ విలోమం, కనుక ఎటుచదివినా ఒకటే. దానికి ఈవలావల అనే భేదం లేదు. ఆలాగే గంగానదికి ఈదరి ఆదరి అనేభేదంలేదు. ఏదరిలో స్నానం చేసినా ఒకటే. కనుక పవిత్రత ఎక్కడ ఉన్నా దానికి ఇక్కడ అక్కడ అని చూడవలసిన పని ఉండదు.

102. కం. మారునకును రామునకును
ధారుణి భేదంబు వస్తుత: లేకుంటన్
వారికి విరోధముండదు
వీరొకచో నుండగలరు వినుమా యార్యా !

వస్తుతః = వస్తువురీతిగా, మార-రామ = ఈ రెండు పదాలలో అక్షరవిన్యాస భేదమేగాని అజ్ఝల్లుల భేదమేదిలేదు కాబట్టి వస్తుతః మారుడు రాముడు ఇద్దరొకటే కనుకయిద్దరుకూడ ఒకే హృదయంలో ఉండగలరు కాని ఒకేసారి మాత్రం పనిచేయరు. ఒకరి తర్వాతనే మరొకరు పని చేస్తారు.

103. కం. వేదాంతం బేర్పడు సుమి
మోదాంతము శృంగభంగ మొందిన చోటన్
ఖేదాంతమదియె వాదులు
భేదంబులు మాన్పజగతి వినుమా యార్యా !

మోదాంతం = సంతోషం; శృంగభంగం = అవమానం, కొమ్ము విరిగిపోవటం.

తెలుగులో మకారానికి కొమ్ము తొలగిపోతే అది వకారమవుతుంది కాబట్టి మోదాంతం అనే పదం మకారం యొక్క కొమ్ము చెడిపినపుడు వేదాంత మవుతుంది. అదే విధంగా సంతోష జీవితానికి విఘాతం కలిగినపుడు మనిషికి వేదాంతం ఏర్పడుతుంది. లోకంలో వాదాలు భేదాలు మాన్పటానికి గూడ అదొక్కటే శరణ్యంగా ఉంది.

104. కం. పరమ పదము గనుటకునై
హరినామస్మరణ దప్ప నయుత విద్యలున్
హరిహరి యవిద్యలగుసుమి
విరమించుటమేలు వాని వినుమా యార్యా !

అయితవిద్యలు = వేయి విద్యలు; అవిద్యలు = అజ్ఞానపు చదువులు, అకారంతో కూడిన విద్యలు; పరమపదం = మోక్షస్థానం. అది కోరితె అందుకు హరినామస్మరణ ఒకటిమాత్రమే చాలు; వేయి విద్యలతో పనిలేదు; అవన్ని అవిద్యలే అనబడుతవి.

అందుచేతనే కృష్ణ శతకంలో

105. కం. హరియను రెండక్షరముల
హరియించెను పాతకంబు లంబుజనాభా
హరినీనామమహత్త్వము
హరిహరిపొగడంగవశమె యవనిని కృష్ణా ! అని చెప్పబడింది.

హరి అంటే హరించేది, నశింపజేసేది అని అర్థం కాబట్టి ఆరెండక్షరాలే మనిషియొక్క భవబంధాలన్ని హరించివేస్తవి.

106. కం. చిత్తమునకు మారాకును
హత్తించిన యపుడుగాక నపవర్గము తా
నుత్తగ నందునె మనుజుడు
మిత్తిచేతి కందకుండ వినుమా యార్యా !

మారాకు హత్తించు = ఏదో ఒక అవలంబనం చేకూర్చు. మకారాన్ని రాకు హత్తించు అనగా చేర్చు - మకారాన్ని రాకు చేర్చినపుడది రామ అనే శబ్దం అవుతుంది. దాన్ని మనస్సుకు అవలంబనం చేసికొన్నవారే ముక్తికి అర్హులుగాని ఇతరులు కారని అర్థం.

రామ శబ్దానికి తారకమంత్రం అని గూడపేరు. తారకం అంటే తరింప చేసేది అని అర్థం. అది నారాయణాష్టాక్షరి, శివపంచాక్షరి మంత్రాల యొక్క ప్రాణాక్షర సంపుటి. అందువల్ల అది శివకేశవాద్వైతంగా గూడ ఉంది.

107. కం. తనుమాలు తగవునుమొ్మద
లును జడుబేరము జగంబులోనుండవు పా
మ్మని చెప్పుచుందురార్యులు
గనుకను నివి యుండలేవు క్ష్మాతలి నార్యా !

తననుమాలు తగవు మొదలుజెడ్డ బేరం ఉండవని సామెత.

తనను కాదను ధర్మం; తకారం విడిచిన తగవు. మొదలు చెడ్డ బేరం = మూలధనం చెడిపోయే వ్యాపారం, మొదటి అక్షరం చెడిన బేరం.

తకారంలేనపుడు తగవు అనే పదం బకారంలేనపుడు బేరం అనేపదాలే ఉండవు. కాబట్టి లోకంలో తకారంలేని తగవు, బకారంలేని బేరం ఉండనట్లు తనకుమాలిన ధర్మం మొదటికి మోసం వచ్చే బేరం ఉండవు.

108. కం. తలతోకలేని బ్రతుకగు
కలకాలపు జీవితంబు గావుననేడున్
వలయును జీతము జనులకు
వెడలును కొలువేదియైన వినుమా యార్యా !

తలతోకలేని బ్రతుకు = కొనమొదలులేని బ్రతుకు, జీతం = కొలువు జీవితం, అనే పదంలో తలతోక రెండు కలిస్తే జీతం అవుతుంది. కాబట్టి మనిషి జీవితానికి జీతం అనగా ఏదో ఒక కొలువవసరం. అది లేకుంటే కలికాలంలో బ్రతకలేడు.

109. కం. యోగము లేకుండిన ను
ద్యోగంబును గుదురునెట్లు యుర్విజనులకున్
బోగములన్నియు యోగపు
వేగుననే గలుగుసుమ్మి పృథివిని యార్యా !

యోగం = అదృష్టం; ఉద్యోగం = కొలువు; యోగంలేకుండిన = ఉత్ అనే ఉపసర్గకు యోగం అనే పదం చేరకుంటే; ఉద్యోగంబునుగుదురునెట్లు = ఉద్యోగమనే పదం ఎట్లా కుదురుతుంది. కుదరటానికి వీల్లేదు. అట్లాగే అదృష్టం లేకుంటే ఉద్యోగం దొరకటాని కవకాశం లేదు.

110. కం. ఇలనుద్యోగమునకు పురు
షలక్షణము గలదుగాన జను పురుషునకే
లలనలకది సమలింగియె
వెలదు లెరుగలేరు దీని వినుమా యార్యా !

"ఉద్యోగం పురుషలక్షణం" సూక్తి - ఉద్యోగం మగవాని లక్షణం అని అర్థం. ఈ సూక్తికి తగినట్లు ఉద్యోగ శబ్దం పుంలింగం. స్త్రీలకు అది సమలింగి = అనగా తమకు తగిందికాదు అని భావం.

ఈనాడిది స్త్రీలు అంగీకరించకపోవచ్చును కాని ఉద్యోగం చేస్తున్నా వారికెట్లాగూ యింటికాపురం తప్పదు కాబట్టి పురుషులతో పోటీపడి వారుద్యోగానికి నిలవటం అదనంగా ఒకభారం పైకెత్తు కోవటమే అవుతుంది.

111. కం. ధనమునకంటెను గొప్పది
కనుగొన సాధనముగాన కర్మిష్ఠులు మ
చ్చునకైన విలువనీయరు
పెనకువతో దానికెపుడు వినుమా యార్యా !

ధనం = డబ్బు; సాధనం = పనిముట్టు.

ధనము మూడక్షరాలు, సాధనము నాలుగక్షరాలు కనుక ధనం కంటె సాధనం గొప్పది. అందుచేత పనిముట్టు విలువ, దాని సాధన విలువ తెలిసిన వారు డబ్బుకు విలువనీయరు.

112. కం. యావత్తు శక్తిబోయెను
గావున ద్రవ్యంబు ద్రవముగానైనది సు
మ్మీ వేళనరునిచేతను
వే విధముల ఖర్చు బెరిగి పృథివిని యార్యా !

యావత్తు = సమస్తం, అంతా, యావడి; ద్రవం = నీరు.

ద్రవ్యం అనేపదంలో యావత్తును తొలగించినపుడది ద్రవం అవుతుంది. కనుక ఈనాడు ద్రవ్యంలో ఉండే సమస్త శక్తులు అనగా దానివిలువ దినదినం పడిపోతుంది. మరో వైపు మానవుని అవసరాలు వేయివిధాలుగా పెరిగిపోతున్నవి. కాబట్టి అది మనిషిచేతిలో నీళ్లకంటె పలచనై జారిపోతుంది.

113. కం. ఆగడమును మొదలెత్తగ
తాగడమున కపుడుబూన దలచిన యటులే
యోగియగుగాక నిదిగని
యేగవలయు జనులయెడల నిలలోనార్యా !

ఆగడం = అకార్యం, నోరుచేయటం; మొదలెత్తు = ప్రారంభించు, మొదటగల అక్షరం ఎత్తివేయు.

ఆగడం అనే పదంలో మొదటి అక్షరం తీసివేస్తే గడం అని మిగులుతుంది. గడం అనగా విఘ్నం, ఆటంకం అని అర్థం.

లోకంలో ఎవ్వరైనా సరే ఇతరులపై ఆగడానికి పూనినపుడు వారు చేసేపనికి యేదో ఆటంకం తలపెట్టినారనియె లెక్క. కాబట్టి జనులిది యెరిగి నడుచుకోవలె.

114. కం. తలపనవారిగ జరుగగ
వలసినట్టి పనులుగూడ వాపోవుచునే
ఇలనేడు జరుగు చుండును
కలికాలపు మహిమనేడు గంటివె యార్యా !

అవారిగ = ఆటంకం లేకుండ; వాపోవు = దుఃఖించు, అఱుచు, వకారంతొలగిపోవు. అవారిగ అనేపదంలో వకారం తొలగినపుడు "అరిగా" అని నిలుస్తుంది. అరి అనగా శత్రువు. ఈనాడు లోకంలో ఏ ఆటంకం లేకుండా జరుగవలసిన పనులుగూడ ఏదోఏదో అరుపులతోనే దుఃఖంతోనే జరుగుతున్నది. కాబట్టి ఇది కలికాలపు మహిమ అనవలె.

115. కం. క్షితినినహం పూర్వికయగు
కృతియెవరికి గూడ బోరు కీడగుదానన్
మతిమంతుండిది యెరిగియు
జితకాముండగుట లెస్స - క్షితిలోనార్యా !

అహంపూర్విక = అహమహమిక - అనగా నేను ముందు నేను ముందు అనే పోటీతత్వం - అహం అనే పదం మొదట గలది; కృతి = పని; అది అహం అనే పదం మొదటచేరి అహంకృతి = గర్వం అనే అర్థం కలది అవుతుంది.

దానికి తగినట్లు ఏపనిలోనైనా నేను ముందు నేను ముందు అనేపోటీతత్వం తమయొక్క గర్వంక్రిందనే లెక్కింపబడుతుంది కాబట్టి ఎవరికైనా అదికూడదు. వారు తమ ఉబలాటానికి కళ్లెంవేసికుని నడిచేవారు కావలెనని దీని తాత్పర్యం. అపుడే వారికి విజయం లభిస్తుంది.

116. కం. యావజ్జీవము నిలువగ
బోవని యభ్యాసమెల్ల భువినాభా సే

గావున నభ్యాసంబును
బోవకుండనిలుపుకొనగ బోలును నార్యా !

యావజ్జీవం = (యావత్+జీవం) బ్రతికినంతవరకు యావత్తుయొక్క స్వరూపం; అభ్యాసం = అలవాటు. దీనిలో యావత్తు తొలగిస్తే అభాసం అని నిలుస్తుంది. అభాసు అనగా వెలవెలబోయినదని తాత్పర్యం కనుక ఏ సదభ్యాసమైనా వ్యక్తిలో అది జీవితాంతం నిలిచి ఉండవలె. ఆ విధంగా లేనపుడది అభాసుకిందనే లెక్క.

117. కం. దేనికి దానికి సహితము
నైనక్రమముతోడ జేయనగుచుండు పనుల్
గానియది దప్పినపుడు
మానవునకు వశముగాక మరుగును నార్యా !

దేనికి = ఏపని ప్రారంభించినప్పటికి; దానికి సహితము = దానికి కూడ. సహితము = సకారముతో కూడినది, క్రమశబ్దం సకారంతో కూడినపుడు సక్రమం అవుతుంది. ఇది దీనిలోని విశేషం.

మానవుడేపని ఆరంభించినా దాన్ని, దానికి తగిన క్రమంతో చేసినపుడే అది పూర్తిస్తుంది; లేకుంటే లేదు. అంటే సక్రమంగా చేయనపుడు ఏపని గూడ నెరవేరదని అర్థం.

118. కం. మానిసికి తిరుగుబాటగు
గానన్ సినిమాను నేడుగని మానవుడా
పూనకపు కనులతోతన
మేనెరుగని శివము బూనుయార్యా !

తిరుగుబాటు = విప్లవం, వ్యతిరేకం. మానిసి అనే పదం తిరుగబడినపుడు "సినిమా" అని అవుతుంది. అందువల్ల అది మానవునికి తిరుగుబాటు.

సినిమా ఈనాడు ఒక బలమైన ప్రచారసాధనం కాబట్టి సాంఘిక విప్లవాలన్ని మొదట సినిమా మూలంగా ప్రచారమైనవే. ఆ తర్వాతనే అవి ప్రజలలో వేరూని నిలిచినవి. సామాన్యునికి సినిమా మూలంగానే ఎంతో తెలిసివచ్చి అతనిలోని

తిరుగుబాటుతనం జాగృతమయింది. ఇది కాదనరాని మరియు కనిపించని సత్యం.

119. కం. తీవి మహా ప్రాణమునకు
తావలమగుగాన తప్పుదారిన బడుచున్
టీవినెగన జనదెప్పుడు
భావుకులకు నెప్పుడేని - మానుగనార్యా !

తీవి = వైభవం, గొప్పదనం; టీవి = నీటు = శృంగారగర్వం - విలాసం. మహాప్రాణమునకు తావలం = మహాప్రాణానికి నిలయం అనగా అది గొప్పవారి స్థానమైనదని అర్థం. తీవి అన్నపు డందులోని తకారం మహాప్రాణంగాబట్టి అది మహాప్రాణనిలయమయింది. టీవి అన్నపుడు టకారం అల్పప్రాణం.

దీనికి తగినట్టు లోకంలో గూడ తీవికి ఉన్న ఉదాత్తమైన అర్థం నీటు అనే దానికి లేదు. కనుక మానవుడెప్పుడే గాని తన తీవిని నిలుపుకునే ప్రయత్నం చేయవలెగాని నీటునే చూచుకోరాదని తాత్పర్యం.

ప్రసక్తంగా ఈనాడిది టి.వి. (T.V.)కి గూడ వర్తిస్తుంది. సామాన్యులు తమను సమస్తం మరిచి అనగా పనిపాటలు గాని చివరకు తమ పొజిషన్ గాని మరిచి టీ.వి.కి అంకితమై కూర్చుంటున్నారు. కనుక అది కూడదు. వారు తమ తీవిని అనగా గంభీరతను, ఉదాత్తతను కాపాడుకోవలె.

120. కం. ఖ్యాతిగ పురోహితుండు పు
నీతుడు గాకున్న కొఱడు, నిక్కముసుమమీ్మ
ఆతనిచే హితమొందవదు
జాతికినేమాత్రమైన జగతినినార్యా !

పురోహితుడు = బ్రాహ్మణుడు, పురస్+హితుడు - భవిష్యత్తు యొక్క హితమును కోరువాడు. పునీతుడు = పవిత్రుడు, పునీతము = పు అనే అక్షరం మొదట పొందింపబడిన శబ్దం; రోహితం = కొఱడు = ఒక ఆయుధవిశేషం, అగ్నివంటి ఎఱ్ఱని రంగు.

పురోహితుడు ఎపుడైనా పవిత్రమైన జీవితం కలిగి ఉండవలె. లేకుంటే అతనితో జాతికి కలుగవలసిన మేలు కలుగదు. కాగా బ్రాహ్మణుడు

పవిత్రుడుకానపుడు ఆయుధంతో లేదా అగ్నితో సమానమైన భయంకలిగించేవాడే అవుతాడు.

121. కం. మొదలెరుగనట్టి యంహతి
యొదవించెను కర్ణునట్టి యోధవరునకే
తుదికీడు గానవెవ్వరు
యదనెరుగని శివముబూన నగునా యార్యా !

అంహతి = దానం, మొదలెరుగనట్టి = దానిమూలం తెలిసికోలేని లేదా పరిణామం తెలిసికోలేని; మొదటి అక్షరం ఎరుగనట్టి అనగా లేనట్టి - "అంహతి" అనే పదంలో మొదటి అకారం తొలగించినపుడు బిందువుతో శబ్దం ప్రారంభంకాదు. కాబట్టి అదికూడ తొలగిపోయి హతి అని మిగులుతుంది. హతి అనగా దెబ్బ.

దానం ఉత్తమగుణమే. ఉత్తమగతికి, యశస్సుకు అది మూలమే అయినా దానంచేసే అపుడు దానివల్ల కలిగే పరిణామాన్ని గూడ ఆలోచించవలె. దుష్పరిణామం ఎవరు కోరరుగదా !

బలిచక్రవర్తికి పాదత్రయం దానం చేసే అపుడు శుక్రుడు, కర్ణునికి కవచకుండలాలు దానంచేసే అపుడు సూర్యుడు వద్దనియే చెప్పినారు. అయినా వారు గురువుల మాటను లెక్కచేయక తమ మాటపై నిలిచి యశఃకాయులైనారు గాని కర్ణునికి మాత్రం తన దానంవల్ల సంపూర్ణంగా కీడేకలిగింది. అందువల్ల అంతటి వీరునికే అది ముప్పుకు కారణమైనపుడు సామాన్యుడొక లెక్కనా ! కనుక దానంగూడ పాత్రాపాత్రత ఆలోచించినట్లు పరిణామంగూడ ఆలోచించియే చేయవలె.

122. కం. బలమెంత ప్రబలమైనను
అలమగునది మొదలు జెడగ నందువలన తా
బలముపయిం గర్వించియు
చెలగవలదు జగతియందు చెరుపగునార్యా !

బలం = తనయొక్క భుజబలం, సైన్యం; మొదలు చెడగన్ = మూలం చెడిపోగా, మొదటి అక్షరం చెడిపోగా

బల శబ్దంలో బ్+అ+ల్+అకారాలనే అక్షుల్లులున్నవి. కనుక వానిలో మొదటిదైన పొల్లు బకారం చెడినపుడా శబ్దం "అలం" అనియే మిగులుతుంది. అలం అనగా ఒకవిధమైన గడ్డి. ఇది సంస్కృత శబ్దమైనపుడు అలమ్ అనగా వద్దని అర్థం.

చేలలోని కలుపు గడ్డి, గాదం అని రెండు రకాలు. గాదం అంటే ఆకులుగల మొక్కలు. తెలుగులో ఆకు - అలం అనేవి జంట పదాలు. ఆకు అంటే ఆకులుగల మొక్కలు. అలం ఆకులవంటి పరకలుగల గడ్డి.

మానవునియొక్క భుజబలం ఎంతగొప్పదైనా దానిమూలం చెడినపుడది గడ్డిపరకతో సమానమే. అందువల్ల ఎవ్వరైనా తమబలాన్ని నమ్ముకొని గర్వపడరాదు.

రాజుల విషయంలో గూడ అంతే. సైన్యం ఎంత గొప్పదైనా ఓకంట కనిపెట్టకుండా దాన్ని నమ్మి గర్వపడరాదు. దాని మూలం చెడినపుడది గూడ ఎందుకు పనికిరాక ప్రభువుల కపజయాలు కలిగిన ఘట్టాలు చరిత్రలో ఎన్నో ఉన్నవి.

123. కం. పసలేని భూపస ముఖము
వసియింపగగాదు సుమ్మి ప్రాజ్ఞులకెపుడున్
పసిడిలభించని యచ్చో
సినలైన నిజంబిదన్న క్షితిలో నార్యా !

పస = శక్తి, సారం; భూపసముఖం = రాజుగారి సన్నిధి. ఈ శబ్దంలో పస తొలగించినపుడు భూముఖం అనగా తలవంచుకోవటం అనే అర్థం నిష్పన్నమవుతుంది. కాబట్టి పండితులైన వారికెవ్వరికి గూడ ఎంతధనం లభించనీ గాక అటువంటి రాజాస్థానాలలో ఉండటం తగదు.

ఈనాడు రాజాస్థానాలు లేవు కనుక నాయకులైనా అంతే. అటువంటి నాయకుల దగ్గర ప్రాజ్ఞులు అనగా లోకవ్యవహారం తెలిసినవారు గూడ ఉండతగదు. వారుండ లేరు గూడ.

124. కం. సమవిషమ లక్షణంబా
సమవిషమములందె గద్దు, జనులను నటులే

తమలక్షణంబు తమ యొ
క్క ముఖంబులె తెలుపుచుండు గనుమా యార్యా !

సమం = సమానమైనది, సరిసంఖ్య; విషమం = సమానంగానిది కఠినమైనది, చెడ్డది, బేసిసంఖ్య. శబ్దానికి తగినట్లు సమవిషమ భేదాలు రెండు ఆశబ్దాలయొక్క అక్షరాలలోనే కనిపిస్తున్నవి. కాబట్టి మనుష్యుల్లో గూడ వారివారి లక్షణం వారివారి ముఖాల్లోనే అదేవిధంగా కనిపిస్తుంది.

125. కం. హాయిని యీలేనప్పుడు
హాయనుటేగానినేదియైన యొనర్పం
బోయెడు చోనిది యెరిగియు
జేయగవలె మానవుండు చెలువుగ నార్యా !

హాయి = సుఖం; ఈ లేనపుడు = కలుగజేయజాలనపుడు, "యి" అనే అక్షరం లేనపుడు; హా = విచారార్థకమైన అవ్యయం.

మానవుడే పని చేసే అపుడైనా దానివల్ల తనకు సుఖముందా లేదా ! అని మొదట ఆలోచించవలె. సుఖం కనిపించనపుడది చేసి లాభముండదు. దానివల్ల తనకు దుఃఖమే కాని సంతోషముండదు.

126. కం. తనకున్ మీరిన చోటను
కనుగొన సంగాతగాడు గాబోయినచో
తనుదానె సంతగాడగు
జనములెరుగలేరు దీనిక్షితిలో నార్యా !

సంగాతగాడు = స్నేహితుడు, సంతగాడు = అంగడికి వచ్చినవాడు అనగా అందరిలో ఒకడు. చాలామంది గొప్పవారితో స్నేహం మంచిదనుకుంటారు గాని తనకంటె మీరిన వానితో స్నేహం పనికిరాదు. అది సమానమైన వారితోనే శోభిస్తుంది.

సంగాతగాడు అనేదానిలో గకారం తొలగిపోయినపుడది సంత గాడవుతుంది. అట్లాగే తనకంటే పెద్దవారి స్నేహితుడు కాబోయినపుడు గూడ స్థాయి తక్కువవాడు కనుక అతనికి సంతగాడుగానే ఉపయోగపడుతాడు గాని స్నేహితునిగా నిలువజాలడు.

127. కం . వేదమనమారు రూపము
చేదనరెడు దేవరూప చిహ్నముగానన్
వేదంబును నిరసించుట
కాదుసుమీ యెవరికైన కనగా నార్యా !

వేదమన మారురూపముచే దనరెడు దేవరూపము.

వేదశబ్దంలో అచ్చులు, హల్లులు తారుమారైనపుడు దేవ అని ఏర్పడుతుంది కాబట్టి వేదమనగా మారు రూపంలో ఉండే దైవమే. అందువలన వేదాన్ని ఎవరూ నిరసించరాదు. దాని ఆజ్ఞను మీరరాదు.

128. కం. తాబెట్టిన గీసుమయిది
తాబట్టిన మాటగాదు తత్వంబిలకున్
రాబట్టి గీతయనగా
వేభంగుల మాటవేల వినుమా యార్యా !

తాబెట్టినగీ = తాను అనగా జీవుడు పెట్టిన మొఱ తకారం చేర్చిన గీ అనే అక్షరం. గీ అనే అక్షరానికి తకారం చేర్చినపుడు గీత అవుతుంది. కాబట్టి గీత అనగా జీవుడు పెట్టిన మొరగాని ఏదో వట్టిమాటగాదు. అందువల్లనే శ్రీకృష్ణుడు "గీతాశ్రయోఽహం తిష్టామి - గీతామేచోత్తమంగృహం" అని చెప్పినాడు. భగవంతుడెక్కడ ఉంటాడు అంటే ఆర్తితో ఎక్కడ మొఱపెడుతుంటారో అక్కడనే ఉంటాడు. దీనికి మనకు గజేంద్రుడొక నిదర్శనం.

129. కం. స్థిరమనగరాదు పుట్టుక
పరుషంబాపైన పూజ్యమక్షర మనరా
దరయగ శూన్యము రెండు ను
కరము చిరముగావు సుమ్మి కలిలోనార్యా !

స్థిరం = శాశ్వతం, స్థిరములనే అక్షరాలు కలది. పుట్టుక అనే పదంలోని అవి స్థిరాక్షరాలు కావు. కాబట్టి పుట్టుక స్థిరంగాదు.

పూజ్యం = గౌరవం, సున్నా; అక్షరం = నశించనిది. సున్నా అక్షరం కాదుగదా.

మనిషికి గల గౌరవం గూడ ఆలాగే శాశ్వతం గాదు. కాబట్టి ఈరెండు తెలిసి వ్యక్తి శాశ్వతం మరియు అక్షరమయిందేదో దాన్ని చేరవలెనని సూచన.

130. కం. పలుకులలో గల తత్త్వము
పలికితినే కొంత కొంత భాషా జలధిన్
గలయన్ని, తఱచితఱచియు
వెలిదీయగనెవరి తరము వినుమా యార్యా !

నేను మన శబ్దాలలో ఉండే అక్షరతత్వాన్ని అనగా నశింపని వాని అర్థస్వరూపాన్ని ఈ పద్యాలలో కొంతకొంత మీకు చూపినాను. వాఙ్మయం అంటే మహాసముద్రం గదా ! దానిలో ఇటువంటి అనర్ఘమణులింకా ఎన్నెన్ని ఉన్నాయో అవన్ని పరిశోధించి, పరిశీలించి వెలికితీయటానికి; తీసి చూపటానికి నావంటి అల్పజ్ఞునికి సాధ్యంకాదు అని నేను పాఠకులకు సవినయంగా విన్నవించుకుంటున్నాను.

గురుదక్షిణ

వై. రుక్మాంగద రెడ్డి (వెల్దండ)

1. ప్రణుతులు మా గురుదేవుల
పాదాలకు ప్రణుతులు
మట్టిని మనిషిగ మలిచిన
మహాత్మునకు వినుతులు.

2. గురుడు గురుడు శేముషి సా
గరుడు అతడు తిమిరహరుడు
చదువు నపుడు విబుధవరుడు
వ్రాతకు వాణీ రమణుడు.

3. అధ్యయనాధ్యాపనమ్ము
లందున తరగని మోహము
తాను నిక్కంబంబువాహం
బైన తీరని దతని దాహము.

4. సంధి చేయునప్పుడెపుడు
సాధుత్వమె కోరుకొనును
లేరు పరిపంథులెవ్వరును
వ్రాతలోను బ్రతుకులోను.

5. ముగ్ధలై యొక మూలకొదిగి
యబ్దములుగా మరుగుపడిన
శబ్దముల ప్రారబ్దములకు
లబ్ధి గూర్చిరి వెదకి వెదకి.

6. కాలగర్భమున చివికిన
తాళపత్ర గ్రంథములకు
ప్రాణవాయు వూదివాని
బ్రతికించిరి కలముబూని.

7. ఏ కవులది యేకాలమొ
చీకటి కోణాలలోన
ఎఱుగరానితమములోన
చిరునామా కనుగొనిరి.

8. ద్వ్యర్థులనుత్ర్యర్థులనుగనినపు
డర్థములతో నాటలాడుచు
అవ్వి సర్కసులోని పులులని
నవ్వి భయమును బారద్రోలిరి.

9. శ్లేషలను గోషాల నుండిన
భాషయోషా సొగసు జూపిరి
చిత్రకవితను దాగియుండిన
చిత్రములను బయలుపరిచిరి.

10. ప్రకృతి వికృతి ప్రపంచమందు
బ్రతుకుచుండిన తాను నిత్యము
సుకృతమాతడు మూల ప్రకృతిని
చూడగల్గెను సత్యము.

11. అక్షరాలతో వతని వెయ్యము
లక్షలను లక్షించు టెరుగడు
రమ్యమైన కవిత్వమొక్కటె
రాజకీయము దిక్కుచూడడు.

12. తనదు కవితా కన్నియలకు
తగునలంకారములు గూర్చిరి
నిత్యమమలిన సత్యమే యౌ
చిత్యమని ప్రకటింప నేర్చిరి.

13. కవిత సాధన జేయచాలును
ప్రభుత తోడ పనే మననిరి
మనిషి మనిషిని గాదు వారి
మనసులను పాలించుమనిరి.

14. కొంచెమెరిగినవారలుగ
గర్వించు చుండిరి కొండలై
వీరి యొాదల మెఱయుచుండును
వినయమే పూదండయై.

15. తన బలమ్మును తానెఱుంగడు
ఘనుడుతా హనుమంతుడా
పరమశివునేదల ధరించెడు
గురుడునగు హిమవంతుడా.

16. పెరటిలోని గంగిగోవు
వరగుణమ్ములకెల్లరావు
భేషజాలకు లేదు తావు
ప్రగల్భాలాలేనెలేవు.

17. లేతనగవుల పూలబుట్ట
లేదు కోపము లేశమైన
జాతిపితకే సొంతమైన
పూతమాధరహాసము.

18. చూడబోతె యేమెఱుంగని
వాడు వోలెను మౌగ్ధ్యము
ప్రౌఢ రచనల గుట్టు విప్పె
ప్రతిభ గల వైదగ్ధ్యము.

F 3357

19. ఎల్లజనుల ప్రశంసలందిరి
ఉల్లమా అది మల్లెపందిరి
శిష్యగణము ప్రతిభగని ఆ
శీర్వదించిరి మురిసిపోయిరి

20. ఇది మీరిచ్చిన యక్షరగుచ్ఛం
బెదలో దాచితినింతకాలము
వాడెనా రేకులు వీడెనాగాని
స్వీకరించి ఆశీర్వదించుడు.

అభిమాన ఛాత్రునికి :

శిష్యుడభిమాన ముప్పొంగి చెప్పెదీని
నందరకు తమ గురువిట్లె - యగుపడు సుమి
యంచు నెంచుచు దీని నర్పించువైరు
నక్షరంబుగ వర్ధిలు మని వచింతు.

సి. పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రము
కడప వారికి ——— బహూకృతి

Prof. B. RAMA RAJU, (Rtrd.)
H. No. 1-8-117/2, Chikkadpally,
HYDERABAD-500 020.

కపిలవాయి లింగమూర్తి



ఈ కవిని గురించి

మీ రచనా వైశిష్ట్యము స్వర్గీయ కాశీపత్యావధానిగారి వైదుష్యమును తలంచుకొని మీబోటి వారు కొందరైనను ఏదో ఒకశాఖకు మాత్రమే కవిత్వముపై గుత్తాధికారము కలదను అపోహను తొలగించుచున్నది.

వై.బి. రెడ్డి, నెల్లూరు - 27.4.198

మీ పుస్తకాలు చదివేను. మీ సరస్వతీ పరివస్య గొప్పది. మీ పాండిత్య పరిణాహం దొడ్డది. మీ కవిత ప్రతిపద రమణీయమైనది. భావార్థ ప్రదర్శితమైన పరిజ్ఞానమ పండిత ప్రపంచ శ్లాఘ్యా శిరఃకంప పాత్రము.

యస్వీ జోగారావు, విశాఖపట్టణం - 18.7.198

డాక్టరేటు మీకు ఒక లెక్కలోనిదిగాదు. ఎప్పుడో రావలిసనది. బిరుదములు గూడ ప్రసాదింపబడవలసి యున్నవి. టి.టి.డి. వారు మీ గ్రంథాలక ఆర్థిక సహాయం చేసినారు, చేస్తున్నారు. కాని వారు మిమ్ములను మహదాంధ్ర వాఙ్మయాకాశంలో ఎందుకు గుర్తించలేదో ఆగమ్య గోచరంగా నున్నది.

బూర్గుల రంగనాథరావు - 18.1.199